## ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు చట్టం అమలు

### సిపి రష్మీ పెరుమాళ్

**సిద్దిపేట,ప్రభాతవార్త ప్రతినిధి:**

జిల్లాలోని 42 ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాల వద్ద ఈనెల 25 నుంచి మార్చి 18 వరకు వరకు 163 బిఎన్ఎస్ఎస్ 2023 సెక్షన్ అమలు చేస్తున్నట్లు సీపీ రష్మీ పెరుమాళ్ తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఈనెల 25 నుంచి మార్చి 18 వరకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. పరీక్షలు జరిగే సమయంలో సమీపంలోని అన్ని జిరాక్స్ సెంటర్స్ మూసి వేయాలన్నారు. పరీక్ష సెంటర్స్ వద్ద నుంచి 200 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడ వద్దన్నారు. పరీక్షలకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పరీక్ష సమయంలో పోలీసు అధికారులు పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్షా సమయాని కంటే గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. విద్యార్థులు మానసికంగా ఎటువంటి ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలన్నారు.




## నేడు నూతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

**జహీరాబాద్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:**

నూతనంగా ఏర్పడిని జహీరాబాద్ మున్సిపల్ కౌన్సిల్ ఈ నెల 24న అత్యవసర సమావేశం ఉదయం 11 గంటలకు మున్సిపల్ సమావేశ మందిరంలో మొదటి మారు కొలువుదీరనుంది. సమావేశానికి మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, ఎక్స్అఫీషియో సభ్యులు హాజరు కావాలని మున్సిపల్ చైర్మన్ మహ్మద్ యూనూస్ పేర్కొన్నారు.

**కోటి ఆశలతో కొలువుదీరుతున్న మున్సిపల్ కౌన్సిల్...**

నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లు మున్సిపల్ కౌన్సిలర్లతో పాటు ఎక్స్అఫీషియో సభ్యులు ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్‌లు మొదటి మారు సమావేశం అవుతున్నందున పట్టణ ప్రజలు సమావేశంపై కోటి ఆశలు పెట్టుకున్నారు. సుదీర్ఘ కాలం తరువాత మున్సిపల్ సమావేశం కొనసాగుతున్నందున అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరిస్తారని పట్టణ ప్రజలు కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు.



హుస్నాబాద్ ఫార్మసీలో ఆకస్మికంగా తనిఖీలు చేస్తున్న డ్రగ్ ఇన్స్పెక్టర్

'వార్త' ప్రభావం

## గర్భవిచ్ఛిన్న మాత్రల అక్రమ దందాపై అధికారుల కదలిక

### ఆకస్మిక తనిఖీలతో అక్రమార్కుల్లో కలవరం

**హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త :** పట్టణంలో గర్భవిచ్ఛిన్న మాత్రల అక్రమ విక్రయాలపై ఇటీవల ప్రచురితమైన కథనానికి ఎట్టకేలకు అధికార యంత్రాంగం స్పందించింది. రెండురోజుల క్రితం ఈ అంశంపై 'ప్రభాతవార్త'లో గర్భవిచ్ఛిత్తి మాత్రల అక్రమవ్యాపారం, మెడికల్ షాపులకే కాదు, ఆర్ఎంపిలు, ప్రైవేట్ ల్యాబ్‌ల వరకు విస్తరణ అనే శీర్షికలతో వార్త వెలువడిన నేపథ్యంలో సిద్దిపేట జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ వినయ్ సుష్మ సోమవారం హుస్నాబాద్‌లోని మెడికల్ షాప్‌లను, ప్రైవేట్ ల్యాబ్‌లను ఇకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా గర్భవిచ్ఛిన్నానికి సంబంధించిన మాత్రలను విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలను ఉల్లంఘించిన మెడికల్ షాపులపై చట్టపరమైన చర్యలతో పాటు లైసెన్సుల రద్దు చేస్తామని చెప్పారు. గర్భవిచ్ఛిన్న మాత్రల విక్రయాలు పూర్తిగా చట్టపరమైన నిబంధనల ప్రకారమే జరగాలని, వైద్యుల పర్యవేక్షణ లేకుండా వాటి వినియోగం మహిళల ప్రాణాలకు ప్రమాదకరమని పేర్కొన్నారు.

**పిహెచ్‌సిని సందర్శించిన డిప్యూటీ డీఎంహెచ్‌వో...**

**అక్కన్నపేట, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోగల సమస్యలపై ఇటీవల 'వార్త'లో పిహెచ్‌సిలో వైద్య సేవల మాయాజాలం, రోగులకు చికిత్స చేస్తున్న స్టాఫ్ నర్స్, డాక్టర్లు గల్లంతు.. రోగులకు తిప్పలు, మారుమూల మండలంలో అనాథలైన రోగులు శీర్షికలతో ప్రచురితం కాగా సోమవారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీకాంత్‌యాదవ్ స్పందించారు. అక్కన్నపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సీలో వైద్య సేవల నిర్వహణ, రోగులకు అందుతున్న సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించారు. కేంద్రంలో ఉన్న సబ్ సెంటర్ల సమస్యలను గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. ( ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని డాక్టర్‌లను ఆదేశించారు.

## కాంగ్రెస్ పార్టీ నుంచి సాయి ప్రతాప్ సస్పెన్షన్

**సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 23,ప్రభాతవార్త :** సిద్దిపేట పట్టణంలో ఓ వివాహిత మహిళపై కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్త సాయిప్రతాప్ దౌర్జన్యం చేసినట్లు వచ్చిన ఆరోపణలు కేసు నమోదు కావడంతో కాంగ్రెస్ పార్టీ నుంచి సాయిప్రతాప్‌ను వెంటనే సస్పెండ్ చేసినట్లు సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు) సోమవారం తెలిపారు. కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణకు మారుపేరుగా ఉందన్నారు. అలాంటి కాంగ్రెస్ పార్టీలో ఉంటూ క్రమశిక్షణ ఉల్లంఘించినందుకు సిద్దిపేట నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ సూచన మేరకు సాయిప్రతాప్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు వివరించారు. కాంగ్రెస్ పార్టీలో ఉంటూ ఇష్టాను సారంగా వ్యవహరిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. దౌర్జన్యాలు మహిళలపై అగత్యాలుచేసే వారిని కాంగ్రెస్‌పార్టీ చూస్తూ ఉరుకోదని హెచ్చరించారు. గాయపడిన బాధితురాలికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు.

## పరిశ్రమ నిర్మాణ పనులు ఆపాలి



జిల్లా అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న కామారం గ్రామస్థులు

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలు ఏర్పాటు చేయవద్దని కామారం గ్రామస్థులు అధికారులను కోరారు. మండల పరిధి కామారం గ్రామ శివారులో ఏర్పాటు చేస్తున్న టైర్లను కరిగించే పరిశ్రమ నిర్మాణ పనులను నిలిపివేయాలని సోమవారం సర్పంచి సుజాత,ఉప సర్పంచి సుధాకర్, పాలవర్గసభ్యులు, గ్రామస్థులు జిల్లా అదనపు కలెక్టర్ నగేష్‌కు ఫిర్యాదు చేశారు. నెల రోజులుగా గ్రామ శివారులో వాహనాల టైర్లను కరిగించి వాటి నుండి ఆయిల్‌నుతీసే పరిశ్రమను ఏర్పాటుచేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. పరిశ్రమ నిర్మాణ పనులు చేపట్టవద్దని యజమాన్యం దృష్టికి తీసుకెళ్లినప్పటికి తమను అనుమతులున్నాయని గ్రామస్థులకు తెలిపారు. పరిశ్రమను ఏర్పాటు చేస్తే వచ్చే వాయు కాలుష్యంతో పక్కనే ఉన్న రెండు చెరువుల్లోని చేపలు చనిపోతాయని, ప్రజలు రోగాల బారిన పడుతారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ శివారులో ఇప్పటికే టైర్లను కరిగించే పరిశ్రమ ఒకటి ఉందని, ఆ పరిశ్రమ వాయ కాలుష్యంవల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు తెలిపారు. ఉన్నతాధికారులు గ్రామంలో పర్యవేక్షించి పరిశ్రమ ఏర్పాటును నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## సిఎం కప్‌లో గీతం విద్యార్థికి మూడు బంగారు పతకాలు

**పటాన్‌చెరు, ఫిబ్రవరి 23,ప్రభాతవార్త:** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని బీఆర్క్ తొలి ఏడాది విద్యార్థిని ఆశ్రిత రాజు సిఎం కప్ 2025-26 పికిల్‌బాల్ పోటీలలో ప్రతిభచాటి మూడు బంగారు పతకాలను గెలుచుకుంది. సీఎం కప్ రెండో ఎడిషన్ తుది దశ పోటీలను ఫిబ్రవరి 2021 తేదీలలో హైదరాబాదులోని లాల్‌బహదూర్ స్టేడియంలో నిర్వహించారు. పికిల్ బాల్ ఉమెన్స్ సింగిల్స్, ఉమెన్స్ డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ పోటీలలో ఆశ్రిత నెగ్గి మూడు బంగారు పతకాలను కైవసం చేసుకుంది. ప్రతిష్టాత్మక టోర్నమెంటును తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ జనవరి 8 నుంచి ఫిబ్రవరి 26వ తేదీ వరకు నిర్వహిస్తోంది. ఈ ఛాంపియన్‌షిప్‌లో హ్యాండ్ బాల్, వెయిట్‌లిఫ్టింగ్, పవర్‌లిఫ్టింగ్, బిలియర్డ్స్, ఫెన్సింగ్, లాన్‌టెన్నిస్, పికిల్‌బాల్ పోటీలను బహుళస్థాయి ఫార్మాట్ లో జరుపుతున్నారు. గ్రామ పంచాయతీ స్థాయిలో ప్రారంభమై, మండల, పట్టణ స్థానికసంస్థల రౌండ్లను నిర్వహించారు. చివరిగా హైదరాబాదులో రాష్ట్రస్థాయి ఫైనల్స్ నిర్వహిస్తున్నారు. ఆశ్రిత రాజు సాధించిన అద్భుతమైన విజయానికి గీతం నాయకత్వం అభినందనలు తెలియజేసింది. గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, ఆతిథ్య విభాగంక్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్ తదితరులు ఆమె పశంసించారు.




బంగారు పథకాలు సాధించిన విద్యార్థి ఆశ్రితరాజు

# టెన్త్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**సంగారెడ్డిమున్సిపాలిటీ, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**

జిల్లాలో జరగనున్న పదవ తరగతి వార్షిక పరీక్షలను ఎలాంటి లోటుపాట్లు లేకుండా సజావుగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ మీటింగ్ హాల్‌లో సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి పరీక్షల నిర్వహణపై సమగ్ర సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మార్చి 14 నుంచి ఏప్రిల్ 15 వరకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 24,657మంది విద్యార్థులు ఎస్సెస్సీ పరీక్షలకు హాజరుకానున్నారని, వీరికోసం 123 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు నిర్ణీత సమయానికి ముందుగానే చేరుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కేంద్రాలవద్ద నిషేధాజ్ఞలు అమలుచేసి, తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటుచేయాలని ఆదేశించారు. పరీక్షల సమయంలో పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ కేంద్రాలు మూసివేయాలని స్పష్టం చేశారు.ప్రతి పరీక్షా కేంద్రంలో తాగునీరు, పరిశుభ్రమైన వాతావరణం, విద్యుత్ సరఫరా, ప్రథమ చికిత్స సదుపాయం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. పరీక్షలు పూర్తయ్యే వరకు ప్రతి కేంద్రంలో ఫుల్‌టైమ్ స్కావెంజర్‌ను నియమించి మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే పరీక్ష సమయాలకు అనుగుణంగా బస్సులు నడపాలని ఆర్‌టిసి అధికారులకు చెప్పారు. ఎంఈఓలు పరీక్షా కేంద్రాలను ముందస్తుగా తనిఖీచేసి అన్ని మౌలిక సదుపాయాలు సిద్ధంగా ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలని తెలిపారు. ప్రశ్నాపత్రాలు, ఆన్సర్ షీట్లను కట్టుదిట్టమైన భద్రత మధ్య తరలించాలని, పరీక్షా కేంద్రాల్లోకి సెల్ ఫోన్లను అనుమతించరాదని స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన ఈ పరీక్షలను అత్యంత బాధ్యతతో నిర్వహిస్తూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా అప్రమత్తంగా ఉండాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు.సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి గోవిందురామ్, డీఎం అండ్ హెచ్‌ఓ డా. వసంత్‌రావు, పోలీస్, ఆర్‌టీసీ, పోస్టల్, విద్యుత్, ట్రాన్స్‌పోర్ట్ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



పోలీసు క్రీడకారులను పరిచయం చేసుకుంటున్న సీపీ రష్మీ పెరుమాళ్

## వత్తిడి నుంచి ఉపశమనానికి క్రీడలు దోహదం

### సిపి రష్మీ పెరుమాళ్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

నిరంతరం విధులతో ఒత్తిడికి గురయ్యే పోలీసు సిబ్బందికి క్రీడలు ఎంతో ఉపశమనాన్ని ఇస్తాయని సీపీ రష్మీ పెరుమాళ్ అన్నారు. పోలీసు పెరేడ్‌లో సోమవారం పోలీసు కమిషనరేట్ వార్షిక క్రీడా పోటీలను సీపీ ప్రారంభించి ఈ సందర్భంగా క్రీడాకారుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ క్రీడలు తోటి సిబ్బందిలో స్ఫూర్తిని నింపుతాయని మైదానంలో ఆడే శారీరక క్రీడలు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయన్నారు. అధికారులు, సిబ్బంది సమయాన్ని వృథా చేసే ఆర్థికంగా నష్టపరిచే ఆన్‌లైన్ బెట్టింగ్‌యాప్‌లకు అకర్షితులు కావొద్దన్నారు. క్రీడా స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ప్రతిభను చాటాలన్నారు. ఇటీవల జరిగిన 4వ తెలంగాణ రాష్ట్ర పోలీసు క్రీడల్లో సిద్దిపేట పోలీసు కమిషనరేట్ పోలీసులు అద్భుత ప్రతిభ కనబరిచిందని ప్రశంసించారు. పోటీల్లో 3 బంగారు పతకాలు, 2 వెండి, 7 క్యాంస పతకాలు సాధించి కమిషనరేట్ కీర్తిని రాష్ట్ర స్థాయిలో చాటిన విజేతలను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ అడ్మిన్ కుశాల్కర్, అదనపు డీసీపీ ఎఆర్ సుభాష్‌చంద్రబోస్, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సన్మానం

**ములుగు, ఫిబ్రవరి 23 (ప్రభాతవార్త):** రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సోమవారం గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, ఏఐసిసి రాజీవ్‌గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కడపల నర్సింహారెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి తీసుకోవాల్సిన అంశాలపై చర్చించారు. అనంతరం నర్సింహారెడ్డి మంత్రిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ విజయ మోహన్‌తో పాటు నాయకులు పాల్గొన్నారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సన్మానిస్తున్న కడపల నర్సింహారెడ్డి




అధ్యాపకులను సన్మానిస్తున్న అదనపు ఎస్పి మహేందర్

## అటానమస్ హోదా జిల్లాకే గర్వకారణం

### అదనపు ఎస్పీ మహేందర్

**మెదక్ టౌన్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) నుంచి స్వయంప్రతిపత్తి (ఆటోనమస్) హోదా మంజూరు కావడం పట్ల జిల్లా అదనపు ఎస్పి మహేందర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ శుభసందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ హుస్సేన్ నాయకత్వంలో కళాశాల అధ్యాపక బృందంనీ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పి మాట్లాడుతూ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల మెదక్ స్వయంప్రతిపత్తి హోదా సాధించడం జిల్లాలో ఉన్నత విద్యాభివృద్ధికి ఒక మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. యూజీసీ నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా కళాశాల విద్యా నాణ్యత, పరిశోధన రంగాల్లో సాధించిన పురోగతికి ఈ హోదా నిదర్శనమని పేర్కొన్నారు. ఆటోనమస్ హోదా ద్వారా విద్యార్థులకు కాలానుగుణంగా పాఠ్యాంశాల రూపకల్పన, నూతన కోర్సుల ప్రవేశం, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల అమలు వంటి అంశాల్లో కళాశాలకు మరింత స్వేచ్ఛ లభిస్తుందని తెలిపారు. విద్యా ప్రమాణాల పెంపు, పరిశోధన అభివృద్ధి, విద్యార్థుల భవిష్యత్తు కోసం కళాశాల అధ్యాపక బృందం నిరంతరం చేసిన కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ హుస్సేన్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ తిరుమలరెడ్డి, శరత్ రెడ్డి, నాగేందర్ రావు, వెంకటేశ్వర్లు సహా అధ్యాపకులను అదనపు ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## మొదలైన రెండవ విడత వార్డు సభ్యులకు శిక్షణ

**చౌటకూరు, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** మండల పరిధిలోని 15 గ్రామ పంచాయతీల 134 మంది వార్డు సభ్యులకు రైతు వేదికలో సోమవారం నుంచి ఈ నెల 27వ తేదీవరకు కొనసాగే రెండవ విడత శిక్షణ తరగతులను ఎంపిడిఓ శంకర్ ప్రారంభించారు. 2018 పంచాయతీరాజ్ చట్టం, వార్డు సభ్యుల విధులు, బాధ్యతలపై శిక్షణ తరగతుల్లో వార్డు సభ్యులకు అవగాహన కల్పిస్తామని ఎంపిడిఓ శంకర్ పేర్కొన్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రొజెక్టర్ ద్వార వార్డు సభ్యులకు శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిఓ సువర్ణ, శిక్షకులు క్రిష్టఫర్, వసంత్‌కుమార్, పాండు, ప్రభాకర్‌రెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడిఓ వేద ప్రకాశ్‌రెడ్డి

# నర్సాపూర్ మున్సిపల్‌లో కొలువుదీరిన కొత్త పాలక వర్గం

**నర్సాపూర్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో గెలుపొందిన చైర్మన్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు సోమవారం మున్సిపల్ కార్యాలయంలో కొత్తగా ఎన్నికైన చైర్‌పర్సన్ లక్ష్మీ రాజుయాదవ్ అధ్యక్షతన మొదటి సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే సునీతరెడ్డి, కమిషనర్ శ్రీరామ్‌చరణ్‌రెడ్డి సమక్షంలో కొత్త పాలకవర్గం కొలువుతీరారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్‌గా మాచునూరి లక్ష్మీరాజుయాదవ్, వైస్ చైర్మన్ వనముల బుచ్చేష్‌యాదవ్‌లు పదవీ బాధ్యతలు చేపట్టారు. అలాగే కౌన్సిలర్లు పదవి బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతరెడ్డి లక్ష్మీరాజు యాదవ్, బుచ్చేష్‌యాదవ్, కౌన్సిలర్లను శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అదే విధంగా మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్ చరణ్‌రెడ్డి వారిని శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతరెడ్డి మాట్లాడుతూ, పార్టీలకతీతంగా నర్సాపూర్ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తెచ్చినట్లయితే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం చైర్ పర్సన్ లక్ష్మీరాజు యాదవ్ మాట్లాడుతూ నర్సాపూర్ మున్సిపల్ అభివృద్ధికి కలిసికట్టు కృషిచేయాలన్నారు. వైస్ చైర్మన్ బుచ్చేష్ యాదవ్ మాట్లాడుతూ ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయకుండా సమస్యలను పరిష్కరించడంలో ముందుంటామన్నారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ మధుసూదన్, కౌన్సిలర్లు నరసమ్మ, సుధీర్‌గౌడ్, అఫ్రీన్, రాజమణి మురళి యాదవ్, జరీనా బేగం, ఇయాజ్, శ్రీకాంత్, సునీత బాల్ రెడ్డి, కందెల రాజు, నిరంజన్ దాస్, సమీనా బేగం,సరళ ఆంజనేయులు గౌడ్, అమ్మల లలితా బిక్షపతి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కొలువు దీరిన కొత్త మున్సిపల్ పాలక వర్గం సభ్యులతో ఎమ్మెల్యే సునీతారెడ్డి



ప్రజావాణిలో వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

## ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

### సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించి ప్రజలకు మేలు చేయాలని సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్‌హమీద్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజలను నుంచి దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. దరఖాస్తుదారులకు సత్వరమే న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో 205 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. దరఖాస్తులను పరిష్కరించడంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేయొద్దని దరఖాస్తు పెట్టుకున్నవారు తిరిగి దరఖాస్తు పెట్టుకోకుండా పని చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**కబ్జాదారుల నుంచి దేవాలయ భూములను కాపాడాలి...**

మోహినిపుర శ్రీవెంకటేశ్వర దేవాలయానికి సంబంధించి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పక్కనగల 5 ఎకరాల భూమిని ఆక్రమణదారుల కబ్జా నుంచి కాపాడి అక్కడ ఎలాంటి నిర్మాణ అనుమతులు ఇవ్వకుండా మున్సిపల్ అధికారులను ఆదేశించాలని కోరుతూ ఉడుత మల్లేశం కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వినతిపత్రం అందజేసి మాట్లాడారు. దేవాలయానికి చెందిన సర్వే నంబరు 1340లోని అసైన్డ్ భూమిలో 5 ఎకరాల స్థలం ఉందని ఈ స్థలంలో 1982 నుంచి శ్రీ వేంకటేశ్వర ఉద్యాన వనం పేరిట మామిడి, ఉసిరి,తులసి వంటి మొక్కలు నాటవనాన్ని అభివృద్ధి చేశారని తెలిపారు. పట్టణానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఈ భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఆరోపించారు. అక్రమణదారుల నుంచి దేవాలయ భూమిని కాపాడాలని కోరారు.

### వెస్ట్ బెంగాల్లో జరిగే జాతీయ వాలీబాల్ క్రీడలకు

## ఉమ్మడి మెదక్ జిల్లా క్రీడాకారుల ఎంపిక

**గుమ్మడిదల ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :** వెస్ట్ బెంగాల్ రాష్ట్రంలో ఫిబ్రవరి 24 నుంచి మార్చి 1వ తేదీవరకు నిర్వహించనున్న సబ్ జూనియర్ జాతీయస్థాయి వాలీబాల్ పోటీలలో ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి బాలుర విభాగంలో డి.మనోజ్‌కుమార్, బాలికల విభాగంలో పి.జయసిని, బి అక్షిత జాతీయస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ ఎంపికలు రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు కనబరిచిన అద్భుత ప్రదర్శన క్రమశిక్షణతో ఉమ్మడి మెదక్ జిల్లా వాలీబాల్ అధ్యక్షులు పరంజ్యోతి, ఆర్ వెంకటేశ్వర్లు, పాల సాయిరాం, కార్యదర్శులు రవీందర్, ఏ కృష్ణ, కే రవీందర్ రెడ్డి, ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాల పట్ల నిబద్ధత పట్టుదల ఉంటే గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా జాతీయస్థాయికి ఎదగవచ్చని ఈ ఎంపికలు నిరూపిస్తున్నాయని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి మెదక్ జిల్లా వాలీబాల్ అసోసియేషన్ సభ్యులు క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. జాతీయస్థాయిలో సత్తా చాటి మంచి ఫలితాలు సాధించి జిల్లాకు తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అలాగే భవిష్యత్తులో మరిన్ని యువక్రీడాకారులు వాలీబాల్ వైపు ఆకర్షితులై ఉన్నత స్థాయికి చేరాలని కోరారు.



వాటర్ ట్యాంకర్‌ను ఢీకొన్న కంటైనర్

## వాటర్ ట్యాంక్‌ను ఢీకొన్న కంటైనర్.. ఇద్దరికి తీవ్ర గాయాలు

**చౌటకూరు, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161వ జాతీయ రహదారిపై మధ్యలో గల పూల చెట్లకు నీరు పట్టిస్తున్న వాటర్ ట్యాంకర్ హైదరాబాద్ నుంచి పిట్లం వెళుతున్న గూడ్స్ కంటైనర్ అదుపుతప్పి ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలకు గురైన సంఘటన సోమవారం ఉదయం చోటు చేసుకుంది. ప్రమాదంలో గూడ్స్ కంటైనర్ డ్రైవర్ మహ్మద్ మజిల్, మహమ్మద్ తగ్దీర్‌లు తీవ్ర గాయాలకు గురయ్యారు. విషయం తెలుసుకున్న జాతీయ రహదారి అంబులెన్స్ సిఎంఎస్ డాక్టర్ శ్రవణ్, పైలెట్ తౌఫిక్ ఘటనా స్థలికి చేరుకుని కంటైనర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన మజిల్‌ను బయటకు తీసి సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ నిద్రమత్తు కారణంగానే నీళ్ల ట్యాంకర్‌ను గమనించకుండా ఢీకొన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. పుల్‌కల్ ఎస్ఐ నల్లా విశ్వజన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆత్యాచార యత్నం కేసులో వ్యక్తి అరెస్టు

**సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 23,ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని కాళ్లకుంట కాలనీలో ఇటీవల వివాహితపై అత్యాచార యత్నం చేసిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎసిపి రవీందర్‌రెడ్డి,వన్‌టౌన్ సీఐ వాసుదేవరావు సోమవారం తెలిపారు. ఈనెల 19న పట్టణంలోని కాళ్లకుంట కాలనీకి చెందిన ఒక మహిళ, అదేకాలనీలో ఉండే జ్యోతి కిరాణం షాపు యజమాని సాదుల్లా సాయిప్రతాప్ ఎవరూ లేని సమయంలో ఆ మహిళలను షాపులోకి తీసుకెళ్లి తలుపులు వేసి అత్యాచార యత్నం చేశాడని తెలిపారు. ఆ మహిళ అతడి నుంచి తప్పించుకొని ఇంటికి వెళ్లినట్లు తెలిపారు. జరిగిన విషయాన్ని ఎవరికైన చెబితే చంపివేస్తానని సాయి ప్రతాప్ బెదిరించడంతో భర్తకి ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారని చెప్పిందన్నారు. ఈవిషయంపై మహిళ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు వివరించారు. కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తుండగా సోమవారం బాధిత మహిళ భర్తకు అసలు విషయం చెప్పగా అతడి ద్వారా అసలువిషయం తెలుసుకొని ఆమెపై అత్యాచారయత్నానికి ప్రయత్నించిన సాయిప్రతాప్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

**సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త :** ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టిన సంఘటనలో ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. టూ టౌన్ సీఐ ఉపేందర్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట పట్టణంలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన బొమ్మల పృథ్వీ(21), గుజ్జరి నవీన్(20)లు ఆదివారం అర్ధరాత్రి భోజనం చేసేందుకు హోటల్‌కు వెళ్తున్నండగా రోబో రెస్టారెంట్ సమీపంలో కరీంనగర్ రోడ్డులో ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి చెట్టుకు ఢీకొనడంతో బైక్‌పై వెనక కూర్చున పృథ్వీ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. నవీన్ తీవ్ర గాయాలతో హైదరాబాద్ గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందినట్లు తెలిపారు. పృథ్వీ మున్సిపల్ కార్యాలయంలో ఉద్యోగిగా పని చేస్తున్నట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఉపేందర్ వివరించారు.

## భవిష్యత్తులో కాంగ్రెస్ మరింత పుంజుకుంటుంది: విజయారెడ్డి

**ఖైరతాబాద్, ఫిబ్రవరి 23 (ప్రభాతవార్త):** భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ మరింత పుంజుకుంటుందని, అన్ని వర్గాల ప్రజలు ఎక్కడ చూసినా పార్టీకి స్వాగతం పలుకుతున్నారని ఖైరతాబాద్ కార్పొరేటర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి. విజయారెడ్డి పేర్కొన్నారు. బస్తీలు, కాలనీలలో ఇప్పటికే సుడిగాలిలా పర్యటిస్తూ ప్రజల కనీస అవసరాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఆమె తెలిపారు. ముఖ్యంగా రోడ్లు, వీధిదీపాలు, డ్రైనేజీ వ్యవస్థ, మంచినీటి పైపులైన్‌లు, నాలాలు సాఫీగా ఉండేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమని, ఖైరతాబాద్ నియోజకవర్గం కోల్పోయినా పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని గుర్తుచేశారు. పార్టీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎలాంటి కార్యక్రమమైనా ముందుచూపుతో ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటామని పి. విజయారెడ్డి స్పష్టం చేశారు.

## వీరాంజనేయ స్వామి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం


ప్రమాణస్వీకారం చేస్తున్న చైర్మన్ కాచం రాము ధర్మకర్తల మండలి సభ్యులు

**సికింద్రాబాద్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:** నామాలగుండులోని శ్రీ వీరాంజనేయులు స్వామి దేవస్థానం నూతన చైర్మన్, దర్మకర్తల మండలి సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆదం సంతోష్ కుమార్ హాజరై నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. చైర్మన్‌గా కాచంరాము, ధర్మకర్తల మండలి సభ్యులుగా కైలాస్ అరుణ్ కుమార్, మున్నూ రు చందు, బి.నరేష్, కె. సాయి కుమార్, అర్.ప్రతాప్, పి.పవన్ కుమార్, షామాల్ రమణిలు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ ఆండాలు, ఈఓ శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

## చిలకలగూడలో పర్యటించిన మాజీ కార్పొరేటర్


చిలకలగూడలో స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న మాజీ కార్పొరేటర్

**సికింద్రాబాద్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:** చిలకలగూడలో పర్యటించిన కార్పొరేటర్ డాక్టర్ సామల హేమ పర్యటించారు. చిలకలగూడ బడి మజీద్ ప్రాంతంలో డ్రైనేజీ ఓవర్ ఫ్లో సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు మాజీ కార్పొరేటర్ డాక్టర్ సామల హేమ దృష్టికి తీసుకువచ్చారు. ఈ మేరకు ఆమె స్పందించి జలమండలి అధికారులతో కలిసి ప్రాంతాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. మజీద్ సమీపంలో డ్రైనేజీ ఓవర్ ఫ్లో కావడానికి గల కారణాలను అధికారులతో చర్చించి, సమస్యను శాశ్వతంగా పరిష్కరించే చర్యలు తీసుకోవాలని ప్రాంత ప్రజల ఆరోగ్యం మరియు సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని త్వరితగతిన చర్యలు తీసుకోవాలని డాక్టర్ సామల హేమ స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ కుషాల్, బి అర్ ఎస్ నాయకులు జహంగీర్, స్థానికులు పాల్గొన్నారు

## సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన సత్యం శ్రీరంగం


కమిషనర్‌ను కలిసిన డాక్టర్ సత్యం శ్రీహరి

**కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**
రేవంత్ రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళతాం అని టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం పేర్కొన్నారు. మాదాపూర్‌లోని న్యాక్ బిల్డింగ్ సైబరాబాద్ నగర పాలక సంస్థ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటైన సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ తొలి కమిషనర్‌గా ఐఎఎస్ అధికారి జి. సృజన బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా డాక్టర్ సత్యం శ్రీరంగం కలిసి పుష్ప గుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ ప్రగతి ప్రస్థానంలో సరికొత్త అధ్యాయం మొదలైందని గొప్ప చరిత్ర కలిగిన మహా నగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నది అని అన్నారు. కొత్తగా ఏర్పడిన సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో అక్రమ కట్టడాల అరికట్టాలని, రోడ్ల మరమత్తులు, చెరువుల సుందరీకరణ, పార్కుల అభివృద్ధి వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. దీనిపై సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజన ఐఎఎస్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

## ప్రమాదకరంగా కంచెలేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్


హైకోర్టు రహదారిలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె లేని దృశ్యం

**చార్మినార్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :** హైకోర్టు రహదారిలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె లేనందున ప్రజలు భయాందోళనకు గురివుతున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచెను ఏర్పాటు చేయాలని పలుమార్లు సంబంధిత అధికారులకు స్థానిక ప్రజలు మొరపెట్టుకున్నప్పటికి ఎటువంటి ఫలితం లేకపోయింది. హైకోర్టు రహదారి మీదుగా ప్రతీ రోజు వేలాది వాహనాలు పాతబస్తీతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు వెళుతుంటాయి. కాగా రోడ్డును ఆనుకుని విద్యుద్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయపడుతున్నారు. రాత్రి వేళల్లో చీకటిలో వాహనదారులు వాహనాలను నడుపుతున్న సమయంలో నానా అవస్థలు పడుతున్నారు. వర్షం కురిసిన సమయంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రక్క నుంచి ప్రజలువెళ్లాలంటనే వెనుకంజు వేస్తున్నారు. గత ఐదు సంవత్సరాలు నుంచి ఇక్కడ ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచెను ఏర్పాటు చేయమని ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. ఇప్పటికైనాసంబంధిత అధికారులు వెంటనే స్పందించి హైకోర్టు రహదారిలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచెనుఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## నాగర్‌కర్నూల్ ఘటనపై దర్యాప్తు జరిపి చర్యలు తీసుకోవాలి : గుజ్జ సత్యం


బీసీ సంక్షేమ సంఘం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం

**హైదరాబాద్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త**
నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో జరిగిన పసిపాప మృతి ఘటనపై రాజకీయ, సామాజిక వర్గాల్లో ఆందోళన కొనసాగుతున్న నేపథ్యంలో, ఈ అంశాన్ని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ ఘటనపై తక్షణ, కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆయన సిఎంకు లేఖ రాశారు. మల్లన్న జాతర సందర్భంగా చోటుచేసుకున్న ఘర్షణలో రజక కుటుంబానికి చెందిన రెండు నెలల శిశువు మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘటన వివరాలతో సిఎంకు లేఖ పంపినట్లు తెలిపారు. సంఘటనపై నిష్పాక్షికంగా, వేగవంతంగా దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే రూ.1 కోటి ఎక్స్‌గ్రేషియా ఆర్థిక సహాయం ప్రకటించాలని, కుటుంబంలోని ఒక అర్హుడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా గృహ పథకాల కింద ఇల్లు మంజూరు చేయాలని, ఘటనకు సంబంధించి బాధ్యత వహించిన స్థానిక ప్రజాప్రతినిధులపై విచారణ పూర్తయ్యే వరకు సస్పెన్షన్‌తో సహా పరిపాలనా చర్యలు తీసుకోవాలని కోరారు. బిసిలపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో బీసీ వర్గాలకు కూడా ప్రత్యేక రక్షణ చట్టం అవసరమని గుజ్జ సత్యం అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో బీసీ జేఏసీ కన్వీనర్ రాజు నేత, ఓయూ జేఏసీ విద్యార్థి రాష్ట్ర అధ్యక్షులు వంశీ నేత , ఓయు జెఏసి చైర్మన్ బాలకృష్ణ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సుభాష్ చంద్రబోస్ నేత పాల్గొన్నారు.

## సున్నం చెరువులో కాంగ్రెస్ నేతలు కబ్జాలు చేస్తే చూస్తూ ఊరుకోం : ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు


సున్నం చెరువు ప్రాంతాన్ని పరిశీలించి అధికారులతో వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ నేతలు అధికారులను అడ్డం పెట్టుకుని కబ్జాలు దర్జాగా చేస్తున్నారని నియోజకవర్గం శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు అన్నారు. సోమవారం అల్లాపూర్ డివిజన్ పరిధిలోని సున్నం చెరువు ప్రాంతాన్ని పరిశీలించారు. సున్నం చెరువులో ఉన్న భూమిని కబ్జాదారులకు వదిలేసి హైడ్రా అధికారులు ఫెన్సింగ్ వేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూమిని కాంగ్రెస్ పెద్దలకు అప్పగించే ధోరణిలో హైడ్రా అధికారుల పనితీరు ఉందని పేర్కొన్నారు. అల్లాపూర్ సర్వే నెంబర్ 30లో ఉన్న ప్రభుత్వ భూమిని ఇరిగేషన్, జీహెచ్ఎంసీ ప్రభుత్వ అధికారులే రూ.47 లక్షలతో ఫెన్సింగ్ వేశారని అదే ప్రభుత్వ అధికారులు వేసిన ఫెన్సింగ్‌ను తీసి వేసి మళ్లీ హైడ్రా అధికారులు కాంగ్రెస్ నేతలకు కోట్ల విలువ చేసే భూములను అప్పగించి కొత్త ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంలో ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, నాయకులు సమయం అడిగితే హైడ్రా కమిషనర్ స్పందించటం లేదన్నారు. హైదరాబాద్ నగరంలో చెరువులను, కుంటలను అభివృద్ధి చేసింది కేసీఆర్ ప్రభుత్వం మున్సిపల్ మంత్రిగా కేటీఆర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అభివృద్ధిచేశారని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు తెలియనీయకుండా లైట్లను సైతం వెలగకుండా చేస్తున్నారని అన్నారు. ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టడం ఇబ్బందులు గురిచేయడమేనా అని రేవంత్ సర్కారును ప్రశ్నించారు. హైడ్రా కమిషనర్ ఏకపక్ష నిర్ణయం తీసుకుని పేదలను రోడ్డుపాలు చేయొద్దన్నారు. ప్రభుత్వ భూములను 3 లక్షల కోట్ల రూపాయలు కాపాడామని హైడ్రా కమిషనర్ చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. సున్నం చెరువులో ఉన్నటువంటి ప్రభుత్వ భూమిని కూడా చెరువుతో కలిపి ఫెన్సింగ్ వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ మాజీ కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్, నియోజకవర్గం మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎమ్‌డీ గౌసుద్దీన్, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు లింగాల అయలయ్య, పిల్లి తిరుపతి, బొల్లు శ్రీనివాసరావు, గాయిత్రినగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు కృష్ణారావు, జితేందర్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతలు కాపాడాల్సిన ప్రభుత్వమే దాడులకు తెగబడుతుంది : బిజెపి



**అత్తాపూర్ ఫిబ్రవరి21, ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి భంగం కలిగిస్తుందని శాంతిభద్రతలు కాపాడాల్సిన ప్రభుత్వమే దాడులకు తెగబడుతుందని పలువురు బిజెపి నాయకులు మండిపడ్డారు. సోమవారం ఎమ్మెల్యే వెంకట రమణా రెడ్డి క్యాంప్ కార్యాలయంపై దాడి, రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు రామచంద్ర రావు అక్రమ అరెస్ట్ ను ఖండిస్తూ బిజెపి రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ పొన్నమోని మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో అరంఘర్ చౌరస్తాలో బిజెపి నేతలు పెద్దఎత్తున్న నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన పలువురు బిజెపి ముఖ్యనేతల మాట్లాడుతూ... కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి క్యాంప్ కార్యాలయంపై కాంగ్రెస్ దుండగులు దాడి చేయడం అత్యంత దురదృష్టకరమని ఇది ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమైన చర్య అన్నారు. ప్రజాప్రతినిధి కార్యాలయంపై దాడి చేయడం అంటే ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడి చేసినట్లేనని మండిపడ్డారు. శాంతి భద్రతలు కాపాడాల్సిన రాష్ట్ర ప్రభుత్వమే కాంగ్రెస్ గుండాలతో దాడులకు పాల్పడుతుందన్నారు. ఎమ్మెల్యే వెంటకరమణా రెడ్డిని పరామర్శించేందుకు వెళ్తున్న రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు అడ్డుకొని అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడం ప్రజాస్వామ్య హక్కులను హరించే విధంగా ఉందని అన్నారు. బాధితులను పరామర్శించడానికి వెళ్లే ప్రతిపక్ష నాయకుడిని అడ్డుకోవడం సిగ్గుచెట్టని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అంజన్ కుమార్, గోల్కొండ ప్రభారి శ్రీధర్, రాజేంద్రనగర్ అసెంబ్లీ ఇన్చార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి , రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కడెం సుధాకర్, జిల్లా కార్యదర్శి కొమురయ్య, ఎస్సీ మోర్చా చేవెళ్ల కన్వీనర్ జోగు రవి, బీసీ మోర్చా రాష్ట్ర నాయకులు అడికె రాజు, జిల్లా ఉపాధ్యక్షులు కె.నరేందర్ రెడ్డి, భిక్షపతి యాదవ్, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు లక్ష్మి నారాయణ, సోల్కర్ రెడ్డి, రాచూరి రాజశేఖర్, కోరాని సదానంద్, నవారు మురళీధర్ రెడ్డి, సాబాద విజయ్ కుమార్, విజయలక్ష్మి , ప్రశాంత్ రెడ్డి, రాహుళప్ప, వంశీ యాదవ్, నగేష్ యాదవ్, రావుల భాస్కర్, సంతు గౌడ్ , సులిగే వెంకటేష్ , పసుపుల సందీప్, వినయ్ రెడ్డి , గోదా పాండు యాదవ్ , పాట్లావత్ రామారావు , సదాల రాజశేఖర్ , శివరాజ్ , బ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

## జలమండలి పునర్వ్యస్థీకరణ...కొత్తగా జోన్లు, సర్కిళ్లు

**- పాత సబ్ డివిజన్ల డీజీఎంలు బదిలీ**
**- కొత్త సర్కిళ్లకు డీజీఎంల నియామకం**

**చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త :** జలమండలి పునర్వ్యస్థీకరణలో భాగంగా పాతబస్తీలోని రియాసత్‌నగర్, అలియాబాద్ జలమండలి సబ్ డివిజన్లు కనుమరుగై సర్కిళ్లుగా మారాయి. రాజేంద్రనగర్ జోన్ పరిధిలో జంగమ్మెట్, చాంద్రాయణగుట్ట, ఫలక్‌నుమా, బహదూర్‌పురా, అత్తాపూర్, రాజేంద్రనగర్ సర్కిళ్లు ఏర్పడ్డాయి. ప్రస్తుత బాలాపూర్ డిజిఎం సురేష్ కుమార్‌ను బోరబండకు, అలియాబాద్ డీజీఎం చందును సరూర్ నగర్‌కు బదిలీ చేశారు. ఆ సబ్ డివిజన్ల స్థానంలో కొత్తగా ఏర్పడిన జంగమ్మెట్ సర్కిల్ డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా ఎన్.వి.రమేష్ గౌడ్, చాంద్రాయణగుట్ట సర్కిల్ డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా కె.సత్యనారాయణ, ఫలక్‌నుమా సర్కిల్ డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా వి.ఎస్.రవి కిరణ్, బహదూర్‌పురా సర్కిల్ డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా ఎ.శ్రీనివాస్‌లను నియమించారు. రాజేంద్రనగర్ జోన్ చీఫ్ జనరల్ మేనేజర్ (సీజీఎం) ప్రభాకర్‌రావు పర్యవేక్షణలో ఆయా సర్కిళ్ళ డీజీఎంలు, వార్డుల వారీగా సెక్షన్ మేనేజర్లు బాధ్యతలు నిర్వహిస్తారు. జంగమ్మెట్ సర్కిల్లో రియాసత్‌నగర్, లలితాబాగ్, జంగమ్మెట్, ఫూల్‌బాగ్, ఖాద్రి చమన్ వార్డులు, చాంద్రాయణగుట్ట సర్కిల్లో బండ్లగూడ, నూరీనగర్, బార్కాస్, కంచన్‌బాగ్, చాంద్రాయణగుట్ట వార్డులు, ఫలక్‌నుమా సర్కిల్లో షా అలీ బండ, ఫలక్‌నుమా, జహనుమా, నవాబ్ సాహెబ్ కుంట, బహదూర్‌పురాలో దూద్‌బౌలి, తీగలకుంట, చందూలాల్ బారధరి, రామ్నాస్‌పురా, కిషన్‌బాగ్ వార్డులకు సెక్షన్ మేనేజర్లు రాబోతున్నారు. వార్డులనే సెక్షన్లుగా పిలువనున్నారు. జీహెచ్ఎంసి తరహాలో పరిపాలనా సౌలభ్యం కోసం, ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పనకై జలమండలిని జోన్లు, సర్కిళ్లుగా పునర్వ్యస్థీకరించారు. అందుకు అనుగునంగా అధికారులను నియమిస్తున్నారు.

### కాంగ్రెస్‌లో చేరిన కుత్బుల్లాపూర్ సిట్టింగ్ కార్పొరేటర్ గౌరీష్

## మరికొందరి చూపూ కాంగ్రెస్‌వైపే

### రసవత్తరంగా మారిన రాజకీయాలు


మహేశ్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న కుత్బుల్లాపూర్ కార్పొరేటర్ కూన పారిజాత గౌరీష్‌గౌడ్, కూన గిరిధర్‌గౌడ్

**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త**
నాటకీయ పరిణామాల మధ్య కుత్బుల్లాపూర్ మున్సిపల్ మాజీ కార్పొరేటర్ కె.ఎం.గౌరీష్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఇప్పటివరకు రెండు సార్లు కౌన్సిలరుగానూ, ఒక పర్యాయం కార్పొరేటర్‌గా గెలుపొందిన గౌరీష్ బార్య కూన పారిజాతాగౌరీష్ ప్రస్తుతం టిఆర్ఎస్ పార్టీ నుండి కార్పొరేటర్‌గా ఉన్నారు. సీనియర్ నాయకుడిగా ఓటమెరుగని నాయకుడిగా మంచిగుర్తింపు పొందిన గౌరీష్‌పార్టీ మారటంపై సర్వత్రా చర్చనీయాంశంగా మా రింది. తెలంగాణ పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జి కొలను హనుమంతరెడ్డిల సమక్షంలో మహేశ్‌గౌడ్ నివాసంలో కె.ఎం.గౌరీష్, ఆయన కుమారుడు కూన గిరిధర్‌గౌడ్‌తోపాటు ఆయన అనుచరులు కాంగ్రెస్‌పార్టీలో చేరారు. కుత్బుల్లాపూర్ మున్సిపాలిటీ మొత్తం ఎనమిది మంది కార్పొరేటర్లు వుండగా అందులో బిజెపిపార్టీకి చెందిన ఒక మహిళ గెలుపొందగా మిగిలిన ఏడుస్థానా లను టిఆర్ఎస్ పార్టీ కైవసంచేసుకుంది. కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి.వివేకానంద్‌కు తనపార్టీ కార్పొరేటర్ , స్వయాన చిన్నాన్న అయిన కె.ఎం.గౌరీష్‌పార్టీ మార టం సవాల్‌గా మారే అవకాశం లేకపోలేదు.

## వసంత నగర్‌లో క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం


క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహిస్తున్న దృశ్యం

**కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**
కెపిహెచ్‌బి కాలనీ వసంత నగర్ డివిజన్‌లోని బుద్ధాస్ వర్టిక్స్ క్లాసిక్ అపార్ట్మెంట్స్‌లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మందలపు సాయిబాబు చౌదరి ఆధ్వర్యంలో బసవతారకం క్యాన్సర్ రీసెర్చ్ ఇనిస్టూట్ వారి సౌజన్యంతో సోమవారం క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించారు. బసవతారకం హాస్పిటల్ డాక్టర్ ప్రేరణ మాట్లాడుతూ ఈ క్యాన్సర్ అనేది అవగాహనతో స్క్రీనింగ్ ద్వారా వ్యాధి నిర్ధారణ చేసుకోవచ్చని ఒకవేళ వ్యాధి ఉన్నట్లయితే ముందుగా మెడిసిన్ తీసుకోవడం ద్వారా వ్యాధి వ్యాప్తి చెందకుండా ముందుగానే అరికట్టవచ్చని ప్రతి మహిళ ప్రతి మగవారు భయంతో కాకుండా బాధ్యతగా ఈ క్యాన్సర్ స్క్రీనింగ్ చేయించుకోవాలని తెలిపారు. సుమారు 250 మంది స్త్రీ పురుషులకు క్యాన్సర్ స్క్రీనింగ్ చేశారు. కాలనీవాసులు మాట్లాడుతూ మందలపు సాయిబాబా చౌదరి ఆధ్వర్యంలో గత 20 సంవత్సరములుగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు ప్రేరణ, ప్రవల్లిక, సౌమ్య, సిమ్రాన్, అబ్దుల్, రేఖ రాజు, గోవర్ధని, వేణు వర్మ, గణేష్, కృష్ణంరాజు, రంగరాజ, కాజా నవీన్, రత్నాకర్, త్రినాధ్, సురేష్, గోపాల్ నగర్ సైదుబాబు, నందమూరి కిషోర్, ప్రసాద్, హరి, శ్రీధర్, తేజ, వీరబాబు పాల్గొన్నారు.

## విద్యకు బడ్జెట్‌లో 20 శాతం నిధులు కేటాయించాలి


మీడియా సమావేశంలో ప్లకార్డులను ప్రదర్శిస్తున్న తల్లుల సంఘం ప్రతినిధులు

**సైఫాబాద్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:** రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 20 శాతం నిధులను కేటాయించాలని, వచ్చే విద్యా సంవత్సరం ఆరంభంలో అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలకు మౌలిక సదుపాయాలను కల్పించాలని తెలంగాణ తల్లుల సంఘం డిమాండ్ చేసింది. లేని పక్షంలో ఎంతటి పోరాటానికైనా సిద్ధమైనని, రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని సంఘం ప్రతినిధులు హెచ్చరించారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జి.భాగ్యలక్ష్మి, కార్యదర్శి కె.సాయిలక్ష్మి, ప్రతినిధులు బి.లలిత, శోభ, ఎస్.రాధ, ఎల్.కవిత, జి.విజయలక్ష్మి, రుబీనా బేగం, జి.పుష్ప తదితరులు మాట్లాడుతూ విద్యకు బడ్జెట్‌లో నిధులు, ప్రభుత్వ విద్యా సంస్థల సమస్యలపై పలు మార్లు ప్రజా ప్రతినిధులు, అధికారులకు విజ్ఞప్తి చేయడం జరిగిందన్నారు. పూర్వ ప్రాథమిక విద్యను అన్ని పాఠశాలల్లో ఏర్పాటు చేయాలని, విద్య హక్కుల చట్టాన్ని అన్ని ప్రైవేటు విద్యా సంస్థల్లో పటిష్టంగా అమలు చేయాలని, ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ కోసం ఒక వ్యవస్థను ఏర్పాటు చేయాలని, ఏకోపాధ్యాయ పాఠశాలల్లో సరిపడ మంది ఉపాధ్యాయులను నియమించాలని వారు కోరారు. విద్యా రంగంలో తెలంగాణ 26వ స్థానానికి పడిపోయిందని, మౌలిక వసతులు కల్పించడంలో తెలంగాణ 29వ స్థానానికి చేరుకుందని, దళిత, ఆదివాసీ విద్యార్థులకు విద్యా సామర్థ్యాలు అందించడంలో, వికలాంగుల బాలలకు అనుకూల పాఠశాలలు ఏర్పాటు చేయడంలో 10, 12 తరగతుల్లో ఈ వర్గాల ఉన్నతస్థాయి మొదలగు అంశాలకు గాను దేశంలో 20వ స్థానంలో ఉందని, పరిపాలనకు సంబంధదించి దేశంలో 20వ స్థానంలో ఉందని, పరిపాలనకు సంబంధించి 18వ స్థానంలో ఉందన్నారు. తమ డిమాండ్లను అమలు చేయకపోతే త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు చేపడతామని వారు హెచ్చరించారు

## భారతీయ ఆధ్యాత్మిక సంపద రామ కృష్ణ పరమ హంస : దామోదర్ గుప్తా


ప్రసంగిస్తున్న పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ కోలేటి దామోదర్

**చిక్కడపల్లి ఫిబ్రవరి 23 ( ప్రభాతవార్త ) :** ఎందరో యోగులు ఋషులకు జన్మ భూమి భారత దేశం. అట్టి భారత దేశ అధ్యాత్మిక సంపద రామ కృష్ణ పరమ హంస అని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ కోలేటి దామోదర్ అన్నారు. సోమవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళా వేదిక పై గాన సభ నిర్వాహణలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యం తో గానసభ అధ్యక్షుడు కళా వి.ఎస్.జనార్ధన మూర్తి అధ్యక్షతన ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపర లో భాగంగా రామ కృష్ణ పరమ హంస స్మృతి కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న కోలేటి దామోదర్ మాట్లాడుతూ కాళికా ఉపాసకుడు ఇన రామ కృష్ణ పరమ హంస మోనమే సందేశం గా శిష్యులు ను సంస్కార వంత జీవితాలకు మార్గ దర్శనం చేశారు అని చెప్పారు ఆయన శిష్యునిగా ప్రభావితం ఇన స్వామి వివేకానంద భారతీయ అధ్యాత్మిక సంపద ను ప్రపంచ వ్యాప్తం చేశారు అని అన్నారు రామ కృష్ణ పరమ హంస పేరిట దేశ విదేశాలలో నెలకొల్ప బడిన రామ కృష్ణ మట్టం లు ధర్మ ప్రచారానికి వ్యక్తిత్వ వికాసానికి సమాజ సేవ కు ప్రతీకలు గా పరమ హంస బోధనల అనుసరించి పని చేస్తున్నాయి అని వివరించారు గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదిక పై ఆరాధన కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు లోకం కృష్ణయ్య సంఘ సేవకుడు భవాని ప్రసాద్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఏఐ సమ్మిట్‌లో కాంగ్రెస్ పార్టీ దేశం పరువు తీసింది

**జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** ఏఐ సమ్మిట్‌లో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దేశం పరువు తీశారని బీజేపీ జాతీయ మహిళా మోర్చ నాయకురాలు, తమిళనాడు రాష్ట్ర ఎన్నికల ఇంఛార్జి వీరపనేని పద్మ అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా రాష్ట్ర కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 20 దేశాల అధినేతలు, 60 దేశాల మంత్రులు పాల్గొన్న సమావేశంలో కాంగ్రెస్ చేసిన చేష్టలు దేశం పట్ల కాంగ్రెస్ పార్టీకి ఉన్న నైతికతను తెలియజేస్తుందన్నారు. ప్రతి ఎన్నికల్లో ప్రజలు ఓటుతో బుద్ధి చెపుతున్న కాంగ్రెస్ పార్టీకి బుద్ధి రావడం లేదన్నారు. రానున్న రోజుల్లో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. దేశం పరువు తీయడమే కాకుండా ఇంకా కాంగ్రెస్ పార్టీ తప్పుడు మాటలు మాట్లాడటం సబబు కాదని స్పష్టం చేశారు.

## సంగీత స్వరార్చన...సంధ్యా రాగ లహరికి శ్రీకారం


సంధ్యా రాగ లహరి కార్యక్రమంలో పాల్గొన్న సంగీత కళాకారులు

**చిక్కడపల్లి ఫిబ్రవరి 23, ప్రభాతవార్త :** సంగీత ప్రియులను అలరించేందుకు, వర్ధమాన కళాకారుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు శ్రీ సాయి శ్రుతి మ్యూజిక్ అకాడమీ ఒక అద్భుతమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సోమవారం సంధ్యా రాగ లహరి అనే శీర్షికతో ప్రతి నెల ఒక ప్రత్యేక సంగీత కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సన్నాహాలు పూర్తి చేసింది. కేవలం సంగీతం నేర్పించడమే కాకుండా, విద్యార్థులు స్టేజ్ మీద ఎలాంటి భయం లేకుండా ధైర్యంగా పాడేలా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అకాడమీ అకాడమీ వ్యవస్థాపకులు గౌరీభట్ల లక్ష్మణ మూర్తి, వసుధ తెలిపారు. శిక్షణ పొందిన విద్యార్థులే ఈ కార్యక్రమాన్ని స్వయంగా నిర్వహించేలా వారికి ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నారు. ఇది మొదటి విభాగమని, భవిష్యత్తులో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి కోసం మరిన్ని వినూత్న కార్యక్రమాలు చేపడతామని అకాడమీ వ్యవస్థాపకులు గౌరీభట్ల లక్ష్మణ మూర్తి, వసుధ వెల్లడించారు.

## బస్తీ సమస్యలను ప్రజావాణి దృష్టికి తీసుకురండీ


ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

**చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త :** నర్కిపూల్‌బాగ్‌లోని జీహెచ్ఎంసి చార్మినార్ జోనల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికై నిర్వహిస్తున్న ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బస్తీ, కాలనీ వాసులు స్థానికంగా నెలకొన్న సమస్యలపై నేరుగా ప్రజావాణిలో ఫిర్యాదు చేయాలని సూచించారు. దాదాపు రెండున్నర గంటల పాటు నిర్వహించిన కార్యక్రమంలో యాకత్‌పురా సర్కిల్‌కు సంబంధించి టౌన్ ప్లానింగ్ సమస్యపై ఒక ఫిర్యాదు అందింది. ఈ కార్యక్రమంలో యాకుత్‌పురా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుభాష్‌రావు, జోనల్ యూబిడి డిప్యూటీ డైరెక్టర్ దేవజా, ఏయంసీ రాజారావు, సీనియర్ అసిస్టెంట్‌లు మహమ్మద్ హమీద్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## అడిక్‌మెట్ డివిజన్‌లో బిజెపి మౌన ప్రదర్శన

**చిక్కడపల్లి ఫిబ్రవరి 23 ( ప్రభాతవార్త ) :** రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ, ప్రజాస్వామ్య వ్యతిరేక వైఖరిని నిరసిస్తూ అడిక్ మెట్ డివిజన్ బీజేపీ డివిజన్ అధ్యక్షుడు పాశం సాయికృష్ణ యాదవ్ నేతృత్వంలో సోమవారం మోన ప్రదర్శన నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామ్‌చందర్ రావు ను అకారణంగా అరెస్ట్ చేయడాన్ని, రాష్ట్రవ్యాప్తంగా నాయకులను, కార్యకర్తలను నిర్బంధించడాన్ని ఈ సందర్భంగా పాశం సాయికృష్ణ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్య గళాన్ని అణగదొక్కేందుకు ప్రభుత్వం దుస్సాహసానికి పాల్పడుతోంది. ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ప్రతిపక్ష నాయకులపై కక్ష సాధింపు రాజకీయాలు చేస్తోంది. ముఖ్యంగా మా రాష్ట్ర అధ్యక్షులు రామ్‌చందర్ రావు గారిని పర్యటనలకు వెళ్లకుండా గృహనిర్బంధం చేయడం, అరెస్టులు చేయడం అత్యంత సిగుచేటు ని విమర్శించారు. ఈ మోన ప్రదర్శనలో డివిజన్ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వ వ్యతిరేక వైఖరిపై తమ నిరసనను వ్యక్తం చేశారు.

## కార్మిక సమస్యల పరిష్కారానికి ధర్నాలు, నిరసనలు

### బిఎంఎస్ జాతీయ అధ్యక్షుడు సుంకరి మల్లేశం

**చిక్కడపల్లి ఫిబ్రవరి 23 ( ప్రభాతవార్త ) :** కార్మికులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) ఈ నెల ఫిబ్రవరి 25న దేశవ్యాప్త ఆందోళన పాటించనుందని జాతీయ అధ్యక్షుడు సుంకరి మల్లేశం వివరించారు. ఆర్టీసీ క్రాస్ రోడ్స్ బిఎంఎస్ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.రామ్ రెడ్డి, నగర అధ్యక్షుడు రాధ కృష్ణ, రాష్ట్ర కార్యదర్శి వి.రమేష్, భాగ్యనగర్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ (బిఎంఎస్ అనుబంధం ) ప్రధాన కార్యదర్శి టి.కృష్ణ తో కలిసి ఏర్పాటుచేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఒడిశాలోని పూరీలో జరిగిన 21వ అఖిల భారతీయ మహాసభల నిర్ణయం మేరకు ఈ నిరసన కార్యక్రమాలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం దృష్టికి పలుమార్లు సమస్యలను తీసుకెళ్లినప్పటికీ, స్పందన తగిన స్థాయిలో లేదని, ఇందులో భాగంగా దేశంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, ర్యాలీలు, గేట్ మీటింగులు నిర్వహించి, నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలపనున్నారు. అనంతరం ప్రధానమంత్రి, కేంద్ర కార్మిక మంత్రి మరియు రాష్ట్ర ముఖ్యమంత్రులకు వినతిపత్రాలు సమర్పించనున్నన్నట్లు తెలిపారు.

## ఆగి ఉన్న కంటైనర్‌ను ఢీకొట్టిన కారు.. మహిళ మృతి

**అబ్దుల్లాపూర్మెట్, ఫిబ్రవరి, 23 ప్రభాతవార్త :** ఆగి ఉన్న కంటైనర్ లారీని కారు ఢీకొట్టిన ఘటనలో మహిళ మృతి చెందిన సంఘటన అబ్దుల్లాపూర్మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది పోలీసులు కథనం ప్రకారం కూకట్పల్లి ప్రగతి నగర్ లో నివసించే సాయి కిరణ్ కుమార్ తన భార్య మోహన ప్రియ ఇద్దరు పిల్లలతో కలిసి విజయవాడ నుంచి కూకట్పల్లి వస్తుండగా మార్గమధ్యలోని పెద్ద అంబర్పేట్ వద్దకు రాగానే వారు ప్రయాణిస్తున్న మారుతి కే టెన్ కారు జాతీయ రహదారిపై పక్కకి ఆగి ఉన్న కంటైనర్ వాహనాన్ని వెనుక వైపు నుంచి ఢీ కొట్టింది. ఈ క్రమంలో ముందు సీట్లో కూర్చున్న మోహన ప్రియ (34) కు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే వనస్థలిపురంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఆమెను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## నాలాలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

**ముషీరాబాద్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** దోమలగూడ, అశోక్‌నగర్ లింగ్ బ్రిడ్జ్ వద్ద నాలాలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహంను దోమలగూడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గత రెండు రోజుల క్రితం నాలాలో ఎవరిదో మృతదేహంను గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వటంతో, నాలా వద్దకు చేరుకున్న పోలీసులు ఆ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, గాంధీ హాస్పటల్‌కు తరలించారు. ఆ వ్యక్తికి సంబంధించిన వివరాలు ఎవరూ తెలపలేక పోవటంతో, సుమారు 35 సంవత్సరాల వయస్సు ఉన్న వ్యక్తి తెల్ల టీషర్ట్ ధరించి ఉన్నాడని, ఎవరైనా ఆ వ్యక్తికి సంబంధించిన వారు ఉంటే దోమలగూడ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. ఆ వ్యక్తి ఎవరు, ప్రమాదవశాత్తూ పడిపోయాడా లేక ఆత్మహత్యకు పాల్పడ్డాడా, లేక ఎవరైనా కావాలని హత్యచేశారా అనే విషయాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

### సీతారాంబాగ్ వెటర్నటి ఆసుపత్రి సమీపంలో మృతదేహం లభ్యం

**అఫ్జల్‌గంజ్, ఫిబ్రవరి 23ప్రభాతవార్త:** గుర్తు తెలియని వ్యక్తి మరణించిన సంఘటన మంగళ్‌హాట్‌పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్.ఐ నరేష్ కథనం ప్రకారం.. సీతారాంబాగ్ వెటర్నటిఆసుపత్రి సమీపంలో సుమారు(32) గుర్తు తెలియని వ్యక్తి మరణించి పడి ఉన్నాడు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని మృతదేహానికి శవ పంచనామా జరిపి పోస్టు మార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో ఉందన్నారు. మృతుడి ఒంటిపై నీలిరంగు ప్రింటెడ్ చొక్కా, నల్లజీన్స్ ప్యాంటుధరించినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. కేసును మంగళ్‌హాట్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## మహిళతో ర్యాపిడో డ్రైవర్ అసభ్య ప్రవర్తన

### -కత్తితో బెదిరింపులు.. కేసు నమోదు

**జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** మహిళతో ఒక ర్యాపిడో డ్రైవర్ అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా కత్తితో బెదిరించిన సంఘటన బంజారాహిల్స్ ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ ప్రాంతంలో నివసించే ఒక గృహిణి (32) తన భర్తతో కలిసి శంషాబాద్ వెళ్లడానికి ర్యాపిడో ద్వారా కార్ బుక్ చేసుకొంది. పోచమ్మ ఆలయం వద్ద కారు ఎక్కే క్రమంలో ఓటీపీ చెప్పిన అనంతరం ర్యాపిడో డ్రైవర్ ఆమెను తీసుకెళ్లడానికి నిరాకరించడమే కాకుండా ఆమెను దూషించాడు. అంతేకాకుండా అతని వ్యక్తిగత భాగాలను అసభ్యంగా ప్రదర్శించడమే కాకుండా కారులో నుంచి దిగాలంటూ బెదిరించాడు. డాష్ బోర్డులో నుంచి కత్తిని తీసి బెదిరింపులకు పాల్పడ్డాడు. ఆమె భర్తను నెట్టివేయడంతో కిందపడగా, ఆమె రెండు చేతులకు గాయలయ్యాయి. ర్యాపిడో డ్రైవర్ మహ్మద్ ముజాహిద్‌పై మహిళ బంజారాహిల్స్ ఠాణాలో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బిఆర్ఎస్ కౌన్సిలర్లను సన్మానిస్తున్న మాజీ మంత్రి హరీష్‌రావు

## రానున్నది బిఆర్ఎస్ ప్రభుత్వమే

### మాజీ మంత్రి హరీష్‌రావు

**సంగారెడ్డి మున్సిపాలిటీ, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త :** రానున్నది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని మాజీమంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. సంగారెడ్డి మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన గెలిచిన, పోటీ చేసిన కౌన్సిలర్లు, సోమవారం సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని హరీష్‌రావు నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని హరీష్‌రావు శాలువాలతో సన్మానించి అభినందించారు. కొన్ని చోట్ల స్వల్ప మెజారిటీతో ఓటమి చెందిన విషయాన్ని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ గుర్తుచేస్తూ, అధికారం అడ్డం పెట్టుకొని ఎన్నో కుట్రలు చేసినప్పటికీ బిఆర్ఎస్ అభ్యర్థులు ప్రజల మద్దతుతో బలంగా నిలిచారని అన్నారు. గెలుపొందిన కౌన్సిలర్లతో పాటు పోరాడి ఓడిన అభ్యర్థులను హరీష్‌రావు అభినందిస్తూ, వారి పోరాటస్ఫూర్తిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి, సదాశివపేట ప్రాంతాలకు చెందిన బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన కౌన్సిలర్లు, అభ్యర్థులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు అన్యాయం



ధర్నాలో మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు రాజనర్సు

**సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాలకు తీరని అన్యాయం చేస్తుందని సిద్దిపేట పట్టణ మున్సిపల్ మాజీ చైర్మన్, బిఆర్ఎస్ నాయకులు కడవెర్గు రాజనర్సు అన్నారు. కాంగ్రెస్ సర్కార్ ఎన్నికల సమయంలో బీడీ కార్మికులకు నెలకు రూ.4 వేల ఆసరా పెన్షన్ అందిస్తామని నమ్మపలికి తీర అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చి మోసం చేస్తున్న నేపథ్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట సోమవారం బిఆర్‌టియు అనుబంధ సంస్థ అయిన తెలంగాణ రాష్ట్ర బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్న నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. అధికారంలోకి రాగానే రూ.2 వేల పెన్షన్‌ను రూ.4 వేలకు పెంచుతామని చెప్పిన కాంగ్రెస్ సర్కార్ నేటీకి అమలుచేయడం లేదన్నారు. బిఆర్ఎస్ హయాంలో రూ. 200 పెన్షన్‌ను రూ.2 వేలకు పెంచుకోవడం జరిగిందన్నారు. కాంగ్రెస్ సర్కారు ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ సర్కార్‌కు గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు మంచే నర్సింలు, బీఆర్‌టియే అధ్యక్షులు రాం బాబుయాదవ్, నాయకులు పిండి అరవింద్, సింగిరెడ్డి ఐలారెడ్డి, మోహన్ రెడ్డి, నర్సింగ్, శోభన్, బాయికాడి శ్రీనివాస్, సంజీవులు, బీడీ టేకేదారులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## చంపిన చేతులకు శిక్ష పడాల్సిందే

### -డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి



మాట్లాడుతున్న దాసరి ఏగొండస్వామి

**గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 23 (ప్రభాతవార్త):** నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో మల్లన్నస్వామి జాతరలో కుల వివక్ష చూపుతూ ఆలయానికి వచ్చినవారిపై దాడిచేసి రెండు నెలల చిన్నారిని కాలితో తొక్కి హత్య చేసిన సర్పంచ్, అగ్రనాయకులపై వెంటనే కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి, జిల్లా కార్యదర్శి బ్యాగరి వేణు, జిల్లా నాయకుడు కొల్గూరి మైసయ్యలు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మల్లన్నస్వామి జాతర సందర్భంగా దర్శనం కోసం ఆలయానికి వచ్చిన చాకలి చంద్రకళ కుటుంబాన్ని ఆలయంలోకి వెళ్ళనివ్వకుండా అడ్డుకొని, కుల దూషణలు చేస్తూ దాడి చేయడం క్షమించరాని నేరమన్నారు. ఈ ఘర్షణలో పసికందు తీవ్రంగా గాయపడి తర్వాత మరణించడం మన సమాజానికి తీవ్రమైన మచ్చ అన్నారు. వెనుకబడిన వర్గానికి చెందిన కుటుంబాన్ని దేవాలయంలోకి ప్రవేశించకుండా అడ్డుకొని దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## చిన్నారి మృతికి కారణమైనవారిపై చర్యలు తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న రజక, బిసి, ఎమ్మార్పీఎస్ నాయకులు

**ములుగు, ఫిబ్రవరి 23 (ప్రభాతవార్త):** నాగర్‌కర్నూల్ జిల్లాలో జరిగిన మల్లన్న జాతరలో చిన్నారి మృతిచెందిన ఘటనకు నిరసనగా సోమవారం రాజీవ్ రహదారిపై రజక సంఘం అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్, బిసి కుల సంఘాలతో కలిసి ధర్నా, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కులాల పేరిట దూషించి చిన్నారిని తన్నడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారి మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాల్సిందిపోయి బాధితులపైనే పోలీసులు కేసు నమోదు చేయడం ఏమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం దాడికి పాల్పడిన వారిపై ములుగు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు భూమన్న కనకరాజు, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మహేష్, ప్రధానకార్యదర్శి శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు రాజు, సహాయకార్యదర్శి భాస్కర్, నవీన్, నాగరాజు, ఆంజనేయులు, రవి, దశరథ, కృష్ణ, వెంకటేష్, ప్రవీణ్, బాబురావు, నవీన్ పాల్గొన్నారు.

## దాడికి పాల్పడినవారిని వెంటనే అరెస్ట్ చేయాలి

**మర్కుక్, ఫిబ్రవరి 23 (ప్రభాతవార్త):** రజకులపై దాడికి పాల్పడినవారిని అరెస్ట్ చేయాలని రజక సంఘం నాయకుడు పాపోళ్ల రాజు డిమాండ్ చేశారు. సోమవారం మర్కుక్‌లో ఆయన మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇటీవల జరిగిన కుమ్మెర మల్లన్న జాతరలో ఎనిమిది మంది రజకులపై దాడికి పాల్పడ్డారని తెలిపారు. జాతరలో జరిగిన ఈ ఘటన రజక సమాజాన్ని తీవ్రంగా కలచివేసిందని పేర్కొన్నారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీస్కకోవాలన్నారు. అలాగే బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడంతో పాటు భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## వివాహితపై అత్యాచార యత్నం

**సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త :** వివాహితపై కాంగ్రెస్ కార్యకర్త అత్యాచార యత్నానికి ప్రయత్నించిన సంఘటన సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కాళ్లకుంట కాలనీలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు, బాధితులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. కాళ్లకుంటకాలనీలో నివాసం ఉంటున్న మహిళ పాపను తీసుకొని కిరాణ షాపుకు వెళ్లగా అక్కడే ఉన్న సాయిప్రతాప్ చేయి పట్టుకొని షాపులోకి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించినట్లు తెలిపారు. ఫోన్ పగలగొట్టి డబ్బులు డిమాండ్ చేసినట్లు చెప్పారు. ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే నిన్ను నీ భర్త, పిల్లలను చంపి వేస్తానని బెదిరించినట్లు తెలిపారు. బాధిత మహిళ సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. విషయం తెలుసుకున్న సామాజిక కార్యకర్త గాదగోని చక్రధర్‌గౌడ్ బాధితురాలిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నిందితులు ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**కాంగ్రెస్ సర్కార్‌లో మహిళలకు భద్రత కరువైంది...**

కాంగ్రెస్ సర్కార్‌లో మహిళలకు భద్రత..భరోసా కరువైందని మున్సిపల్‌చైర్మన్ మంజుల రాజనర్సు అన్నారు. సిద్దిపేట పట్టణం కాళ్లకుంట కాలనీకి చెందిన మహిళపై ఇటీవల సాదుల సాయిప్రతాప్ గంజాయి మత్తులో విచక్షన కోల్పోయి మహిళను బలాత్కారం చేయడం ద్వారా ఆమె ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాణాపాయ స్థితిలో ఉందని తెలుసుకొని





నిందితుడుని శిక్షించాలని కోరుతూ అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న చైర్మన్, కౌన్సిలర్లు

బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు కొండం సంపత్‌రెడ్డి, కౌన్సిలర్లతో కలిసి బాధిత మహిళను పరామర్శించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు ఆదేశాల మేరకు తక్షణ సహాయం కింద రూ. 10 వేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీసు ఉన్నతాధికారులు లోతైన సమాచారాన్ని సేకరించి బాధితురాలకి తగిన న్యాయం చేయాలన్నారు. బాధితురాలికి బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. అనంతరం జిల్లా కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హామీద్, సీపీ కార్యాలయంలో సీపీ రష్మి పెరుమాళ్‌కు నిందితుడిని అరెస్టుచేసి కఠినంగా శిక్షించాలని వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కొండం కవిత సంపత్‌రెడ్డి, కాటం శోభరాఘు రామ్, శ్రీలత, దీప్తి, నాయకులు బూర విజయ, నందాదేవి, అరుణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'వార్త'కు స్పందన

## ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి తెస్తాం : సర్పంచ్

**అక్కన్నపేట, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త :** మండలంలోని మల్లంపల్లి గ్రామంలో పల్లె దవాఖానలో ఉన్న సమస్యలపై 'ప్రభాతవార్త'లో సోమవారం 'ప్రారంభం కాకముందే కూలుతున్న పల్లె దావాఖానా, బాత్రూంలో నీళ్ల కరువు, రోగులకు అవస్థలు' శీర్షికలతో ప్రచురితమైన కథనానికి సర్పంచ్ మేక ఎస్తార కొమరయ్య స్పందించారు. ఈసందర్భంగా దావాఖానాను సర్పంచ్ పంచాయతీ కార్యదర్శి సతీష్‌తో కలిసి సందర్శించి పరిశీలించారు. గ్రామంలోని ఆసుపత్రి ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన అవసరం ఉందని, దవాఖానలో ఉన్న వసతుల లోపం, శుభ్రత సమస్యలతో పాటు ఇతర ఇబ్బందులపై ఇప్పటికే అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు. త్వరలో ఆసుపత్రిలో అసంపూర్తిగా ఉన్న పనులను పంచాయతీ నిధులతో బాగుచేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. గ్రామ ప్రజలు ప్రభుత్వ దావాఖానాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## రైతులకు అవగాహన సదస్సు

**వెల్దుర్తి, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని రైతు వేదికలు సోమవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆత్మ వ్యవసాయ సాంకేతిక యాజమాన్యం సంస్థ సౌజన్యంతో రైతులకు ప్రకృతి వ్యవసాయం, వరి పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఏవో ఝాన్సీ అవగాహన కల్పించడం జరిగింది. జీవన ఎరువుల వాడకానికి సంబంధించిన సలహాలు సూచనలు తెలియజేస్తూ అధిక మొత్తంలో రసాయన ఎరువులు వాడటం వల్ల కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో అధికారులు రైతులు పాల్గొన్నారు.

## కుల అహంకారులకు యావజ్జీవం విధించాలి

**బెజ్జంకి, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త :** నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో చిన్నారిని చిదిమేసిన కుల అహంకారులకు రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం యావజీవం విధించాలని నియోజకవర్గ బిఆర్ఎస్ యువజన ప్రధాన కార్యదర్శి కొర్వి తిరుపతి ముదిరాజ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం చిన్నారి కుటుంబానికి ఆర్థికంగా చేయూతనందించి ఆదుకోవాలన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా

### ప్రిన్సిపల్ హుస్సేన్

**మెదక్ టౌన్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మెదక్‌కు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) స్వయంప్రతిపత్తి (అటానమస్) హోదాను మంజూరు చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ హుస్సేన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల సమర్పించిన ప్రతిపాదనను పరిశీలించిన యూజీసీ స్టాండింగ్ కమిటీ సిఫార్సుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. యూజీసీ 30-1-2026న జరిగిన సమావేశంలో ఈ నిర్ణయాన్ని ఆమోదించి, 2026-27 విద్యాసంవత్సరం నుండి 2030-31 వరకు ఐదు సంవత్సరాలపాటు స్వయంప్రతిపత్తి హోదా కల్పించినట్లు ప్రిన్సిపల్ వివరించారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నుండి సోమవారం ఉదయం కళాశాలకు అధికారిక సమాచారం అందినట్లు తెలిపారు. ఈ విషయం తెలిసిన వెంటనే ఉపాధ్యాయులు విద్యార్థులు కళాశాల ముందు సంబరాలు చేసుకున్నారు. ఈ హోదా ద్వారా కళాశాలకు విద్యా ప్రణాళికలు రూపొందించుకోవడం, పాఠ్యాంశాల్లో నూతన మార్పులు చేయడం, నైపుణ్యాధారిత కోర్సులను ప్రవేశపెట్టడం, పరీక్షా విధానాల్లో సంస్కరణలు చేపట్టడం వంటి అనేక విద్యా స్వేచ్ఛలు లభిస్తాయని చెప్పారు. స్వయం ప్రతిపత్తి హోదా కళాశాల విద్యా ప్రమాణాల మెరుగుదలకు, విద్యార్థుల ఉపాధి అవకాశాల పెంపుకు, పరిశోధనాభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. నూతన విద్యా విధానం ( ఎన్ ఇ పి 2020) అమలుకు ఇది బలమైన పునాది అవుతుందని పేర్కొన్నారు. ఈ విజయానికి సహకరించిన ఉన్నత విద్యాశాఖ అధికారులు, ఉస్మానియా విశ్వవిద్యాలయం అధికారులు, అధ్యాపక బృందం, సిబ్బంది, పూర్వ విద్యార్థులు, విద్యార్థులకు ప్రిన్సిపల్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కళాశాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు అందరి సహకారం కొనసాగించాలని కోరారు.





కళాశాల ముందు సంబరాలు చేసుకుంటున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

## ప్రజావాణి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**సంగారెడ్డి మున్సిపాలిటీ, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త :** ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి అందిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల కారణంగా తాత్కాలికంగా నిలిపివేసిన ప్రజావాణి కార్యక్రమం సోమవారం నుండి యథావిధిగా పునఃప్రారంభమై, జిల్లా కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్లో నిర్వహించబడింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాధురి, డిప్యూటీ కలెక్టర్ ఉమా హారతి, జడ్పీ సీఈవో జానకి రెడ్డి, ఆర్డీఓలు రాజేందర్, దేవుజ తదితరులతో కలిసి కలెక్టర్ ప్రజలనుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజావాణిలో మొత్తం 38 వినతులు అందగా, వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపించి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేకుండా, ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజావాణిలో విద్య, వైద్య, రెవెన్యూ, మహిళా శిశు, దివ్యాంగుల సంక్షేమం , గృహ నిర్మాణ, డీఆర్‌డిఓ, డీటీఓ, నీటిపారుదల, సర్వే ల్యాండ్ రికార్డ్స్, బీసీ సంక్షేమం , పంచాయతీ రాజ్, మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించిన ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## నవోదయలో ఉత్సాహంగా బ్యాగ్ లెస్ డే

**వర్గల్, ఫిబ్రవరి 23 (ప్రభాతవార్త):** జవహర్ నవోదయ విద్యాలయ వర్గల్‌లో మూడురోజులుగా బ్యాగ్‌లెస్ డేను ఉత్సాహంగా నిర్వహించడం జరిగిందని ప్రిన్సిపల్ దాసి రాజేందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం విద్యార్థులు చేసిన గాలిపటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని అన్నారు. నవోదయ విశ్రాంత ఉపాధ్యాయుడు జెట్టి శ్రీనివాసులు గణితశాస్త్ర థీమ్ పార్కులో విద్యార్థుల సహాయంతో వారికి తగు సూచనలు ఇచ్చి త్రిడీ మోడల్స్‌పై పెయింటింగ్‌తో సూత్రాలనురాయడం జరిగిందన్నారు. కేంద్రీయ విద్యాలయ విశ్రాంత ఉపాధ్యాయుడు రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒరిగామి అనే కృత్యము విశేషంగా ఆకట్టుకోగా, కలర్ పేపర్స్‌తో రకరకాల కటింగ్స్‌తో త్రీ డైమెన్షనల్ మోడల్స్‌ను తయారు చేయడం జరిగిందన్నారు.

## నూతన బస్సులు ప్రారంభం

**హుస్నాబాద్ టౌన్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త :** ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో రాష్ట్ర రవాణాశాఖ ద్వార హుస్నాబాద్ డిపోకు మంజూరైన మూడు బస్సులను మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మికొమురయ్య సోమవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బస్సులు నిర్ణీత సమయానికి నడుస్తూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేలా అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. మొత్తం మూడు బస్సుల్లో ఒకటి భద్రాచలంకు, రెండు బస్సులు ఆదిలాబాద్‌కు నడపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హుస్నాబాద్ డిపో మేనేజర్ వెంకన్నతో పాటు మున్సిపల్ వైస్ చైర్మెన్ చిత్తారి పద్మరవిందర్, కౌన్సిలర్లు చెన్నబోయిన అనూషవిద్యాసాగర్, బూరుగు లత కిష్టస్వామి, సావుల మంజుల, పూదరి వరప్రసాద్, పిల్లి తిరుపతి, బొలిశెట్టి రాజు, ఆకుల రజితవెంకన్న, వైద్యం కిరణ్, కాశబోయిన రమేష్, గోపగోని శోభన్‌బాబుతో పాటు తదితరులు ఉన్నారు.

## పుట్టి రాజును పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

**రామాయంపేట, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త :** ముదిరాజ్ సంఘం మెదక్ జిల్లా అధ్యక్షులు పుట్టి రాజును మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సోమవారం పరామర్శించారు. పుట్టి రాజు తల్లి సావిత్రమ్మ ఇటీవల మృతి చెందగా దశదినకర్మ సందర్భంగా ఈరోజు పరామర్శించడం జరిగింది. ఈ సందర్భంగా హనుమంతరావు విచారం వ్యక్తం చేస్తూ కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహిపాల్ రెడ్డి, కౌన్సిలర్‌లు గజవాడ నాగరాజు, దేవుని రంజిత్, ఝాన్సీ లింగాపూర్ సర్పంచ్ మానెగల్ల రామకృష్ణయ్య, నాయకులు పోచమ్మల గణేష్, దేమే యాదగిరి, రాజా కిషన్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తాం

### గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్



మాట్లాడుతున్న గంగిశెట్టి చందన రవీందర్

**గజ్వేల్, ఫిబ్రవరి 23 (ప్రభాతవార్త):** గత ప్రభుత్వంలో కులాలకు, మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేస్తూ కుల సంఘాల భవనాలను ఏర్పాటు చేయడం జరిగిందని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందన రవీందర్ పేర్కొన్నారు. సోమవారం ప్రజ్ఞాపూర్‌లోని 4వ వార్డులో విశ్వకర్మ మనుమయ సంఘం అధ్యక్షులు గడియారం వెంకటచారి, వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ అధ్యక్షుడు కొక్కొండ శ్రీనివాసచారి, సంఘం ఉపాధ్యక్షుడు గడియారం వెంకటేశంచారి, ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు గడియారం స్వామి చారి, ప్రధాన కార్యదర్శి అరునోజి లక్ష్మినరసింహ చారి, ప్రచార కార్యదర్శి అరునోజి శ్రీనివాసచారి, కోశాధికారి నాగరాజుల ఆధ్వర్యంలో నూతన మున్సిపల్ పాలకవర్గానికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో 18 వార్డుల కౌన్సిలర్లతో పాటు మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లు పాల్గొన్నారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందన రవీందర్ మాట్లాడుతూ గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామన్నారు. పట్టణ అభివృద్ధే ధ్యేయంగా తమ పాలకవర్గం పనిచేస్తుందన్నారు. విశ్వకర్మలు ఐక్యమత్యంతో ఉండి విజయాలు సాధించాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. మల్లన్నసాగర్‌కు సంబంధించిన సమస్యలపై మాట్లాడారు. నూతనంగా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం వైస్ చైర్మన్ కళ్యాణ్‌కార్ పద్మాబాయి నర్సింగరావు మాట్లాడుతూ పార్టీలకతీతంగా మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అసంపూర్తిగా ఉన్న విశ్వకర్మ మనుమయ సంఘం భవనాన్ని పూర్తి చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే 16వ వార్డు కౌన్సిలర్ నాయిని సత్యలక్ష్మి యాదగిరి మాట్లాడుతూ గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి సహకారంతో మున్సిపాలిటీని అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. అసంపూర్తిగా ఉన్న విశ్వకర్మ మనుమయ సంఘం భవనం విషయాన్ని నర్సారెడ్డి దృష్టికి తీసుకెళ్లి పూర్తిచేసేవిధంగా ప్రయత్నం చేస్తామన్నారు. అనంతరం మున్సిపల్ పాలకవర్గాన్ని శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ మనుమయ సంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ పెంటాచారి, డాక్టర్ వాసవచారి, దత్తాద్రిచారి, యాదగిరిచారి, అరవిందచారి, దశరథంచారి, నారాయణచారి, బ్రహ్మచారి, లక్ష్మణ్‌చారి, గాంధారి రవీందర్‌చారి, భాస్కరచారి, శ్రీనివాస్‌చారి, రాజేశ్వర్‌చారి, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



నూతన అధ్యక్షులు, ఉపాధ్యక్షులను సత్కరిస్తున్న సర్పంచ్‌లు

## సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడిగా బానోతు వెంకటేష్

**అక్కన్నపేట, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త :** సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడిగా బానోతు వెంకటేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అక్కన్నపేట మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జంగపల్లి ఐలయ్యతోపాటు పార్టీ మండల ఇంచార్జీ పెద్ది ప్రవీణ్‌లు అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి హాజరైన మండల సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు శ్రీరాంతండా గ్రామ సర్పంచ్ బానోతు వెంకటేష్‌తోపాటు మండల ఉపాధ్యక్షులుగా నందారం గ్రామ సర్పంచ్ సుకుర్తి శ్రీలతబాలరాజులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. అనంతరం నూతన మండల అధ్యక్షులు, ఉపాధ్యక్షులుగా ఎన్నికైన సభ్యులు శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## నష్టపరిహారం పెంచి న్యాయం చేయండి

**రామాయంపేట, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త :** సంగారెడ్డి నుండి ఎల్కతుర్తి జాతీయ రహదారి 765 డిజి ఏర్పాటులో భాగంగా రామాయంపేటలో భూములు కోల్పోతున్న తమకు నష్టపరిహారం పెంచి, న్యాయం చేయాలని భూనిర్వాసితులు సోమవారం తహశీల్దార్ రజనికుమారికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎకరాకు కోట్లలో పలికే భూమిని కేవలం 10 లక్షలకు విలువ కట్టడం అన్యాయం అన్నారు. 33 ఎకరాల విలువైన స్థలంలో సుమారు 60 మంది (కుటుంబాలు) బాధితులు 60 కోట్ల విలువైన భూములు కోల్పోన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం 19 కోట్ల పరిహారం ప్రకటించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై కలెక్టర్‌ను కలిసి విన్నవించనున్నట్లు భూనిర్వాసితులు తెలిపారు.

## పసిపాప మృతికి కారకులైనవారిని కఠినంగా శిక్షించాలి

### రజక సంఘం మెదక్ జిల్లా అధ్యక్షుడు సంగు స్వామి

**రామాయంపేట, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** నాగర్ కర్నూల్‌లో జరుగుతున్న రజక జాతిపై అన్యాయాన్ని, అగ్రకుల నాయకుల దౌర్జన్యాన్ని అరికట్టడాన్ని యావత్ తెలంగాణ రజక జాతి ముక్తకంఠంతో ఖండిస్తున్నామని మెదక్ జిల్లా రజకసంఘం అధ్యక్షుడు సంగు స్వామి అన్నారు. సోమవారం రామాయంపేటలోని చాకలి ఐలమ్మ విగ్రహంవద్ద సంఘం నాయకులతో కలిసి మాట్లాడుతూ నాగర్‌కర్నూల్‌లో పసిపాప అని చూడకుండా బూటుకాలితో తన్ని చావుకు కారకులైన వారందరినీ కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వెంటనే వారిని జైలుకు పంపాలని లేనిచో యావత్ తెలంగాణ రజక జాతి మొత్తం కుల సంఘాలన్నీ కలుపుకొని సహాయ నిరాకరణ ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. అంతేకాకుండా న్యాయం జరిగే వరకు రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, రాస్తారోకోలు చేస్తామన్నారు. మృతి చెందిన పాప కుటుంబానికి కోటి రూపాయలు ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పోచయ్య, గౌరవ అధ్యక్షులు చిన్న నారాయణ, ఉపాధ్యక్షులు మామిడి సిద్ధరాములు, మ్యాతరి నర్సింలు రామాయంపేట యూత్ సభ్యులు ఊరసత్యం, మ్యాతరి స్వామి, నిజాంపేట్ అధ్యక్షులు బురుగుపల్లి చంద్రం, బూరుగుపల్లి బాబు తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కోసం రాస్తారోకో...



రాస్తారోకో చేస్తున్న దృశ్యం

**పాపన్నపేట, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో ఒక ఫర్టిలైజర్ దుకాణానికి యూరియా వచ్చినప్పటికీ సంబంధిత షాప్ యజమాని పంపిణీ చేయడం లేదని ఆరోపిస్తూ మెదక్ బొడ్మెట్పల్లి ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. దీంతో ఎక్కడివాహనాలు అక్కడ ఆగిపోయాయి. ఈ విషయమై వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్ రాజు మాట్లాడుతూ మండలం లోని కొత్తపల్లి, పాపన్నపేట, చీకోడ్ గ్రామాలకు 13 నుండి 14 వందల బస్తాలు వచ్చాయని, ఐతే సంబంధిత షాపులకు కంపెనీ నెంబర్ రాలేదని నెంబర్ రాకుండా బస్తాల పంపిణీ చేయడం సాధ్యం కాదన్నారు, రేపు నెంబర్ వస్తుందని రాగానే యూరియా పంపిణీ చేస్తామన్నారు.

## పార్క్ నిర్మాణానికి సొంత స్థలం ఇచ్చిన సర్పంచ్



మొక్కలు నాటుతున్న దృశ్యం

**టేక్మాల్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త :** గ్రామాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి లక్ష్యంతో ముందుకు సాగుతున్నానని దాదాయపల్లి గ్రామ సర్పంచ్ నరసింహారావు దేశ్‌పాండే అన్నారు. సోమవారం గ్రామంలో పార్క్ ఏర్పాటుకు సొంత అర ఎకరం స్థలాన్ని కేటాయించి 35 లక్షల వ్యయంతో మొక్కలు నాటించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తఐదు సంవత్సరాల పరిపాలనలో గ్రామాన్ని అభివృద్ధి చేసి చూపిస్తాం న్నారు. అల్లాదుర్గం సిఐ రేణుకరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో అక్రమ మద్యం అమ్మకాలు జరపకూడదని గ్రామ తీర్మానాన్ని అభినందించారు. మద్యం మత్తులో కుటుంబాలను వీధిపాలు చేసుకుంటున్నారని అవి జరగకుండా ఉండేందుకుగాను అక్రమ మద్యం అమ్మకాలను నిలిపివేస్తూ సర్పంచ్ దేశ్‌పాండే ఆధ్వర్యంలో తీర్మానాన్ని తీసుకోవడం ఆహ్వానించదగ్గ విషయమని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో టేక్మాల్ ఎస్ఐ అరవింద్ కుమార్, గ్రామ కార్యదర్శి నాగేశ్వర్, టెక్మల్ మండలం విద్యుత్ ఏఈ ఉదయ్ భాస్కర్, ఉప సర్పంచ్ శోభ, వార్డు సభ్యులు జోగినాథ్, చాంద్ పాషా, బంటు దుర్గయ్య, రాజు, ప్రభాకర్ లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## నూతన మున్సిపల్ పాలకవర్గానికి సన్మానం

**నర్సాపూర్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:**

నర్సాపూర్ మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపాలిటీ పాలకవర్గం పదవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు మున్సిపల్ యూనియన్ ఆధ్వర్యంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజుతో పాటు మున్సిపల్ సిబ్బంది నూతన మున్సిపల్ పాలకవర్గానికి శాలువాలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు మున్సిపల్ సిబ్బంది పుష్ప రాములు అనిత శంకరయ్య జ్యోతి దేవయ్య తదితరులు ఉన్నారు





పాలకవర్గానికి సన్మానం చేస్తున్న యూనియన్ సభ్యులు తదితరులు



హరీష్‌రావుకు డైరీని అందజేస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

## మాజీ మంత్రి హరీష్‌రావును కలిసిన ఎమ్మెల్యే

**సదాశివపేట, ఫిబ్రవరి 23 (ప్రభాతవార్త):** మాజీ మంత్రి హరీష్‌రావుని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మర్యాదపూర్వకంగా కలిసి విశ్వ లింగాయత్ ట్రస్ట్ అధినేత పాసారం శ్రీనివాస్ ముద్రించిన బసవ డైరీ 2026ని అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు శివరాజ్ పాటిల్, సంగారెడ్డి జిల్లా వీరశైవ లింగాయత్ సమాజ పెద్దలు చీల మల్లన్న, గౌరవ సలహాదారులు అన్మిశెట్టి జయప్రకాష్ పాల్గొన్నారు

## సహజ వ్యవసాయంపై రైతులకు అవగాహన



సహజ వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న ఏఓ అభినాష్ వర్మ

**న్యాల్‌కల్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** రసాయన ఎరువుల వినియోగం తగ్గిస్తూ ఆరోగ్యకరమైన ఉత్పత్తులను(పంటలను) పండించేందుకు సహజ వ్యవసాయం ఉపయోగకరంగా ఉంటుందని మండల వ్యవసాయ అధికారి ఎన్.అభినాష్‌వర్మ అన్నారు. సోమవారం హద్నూర్ గ్రామంలోని రైతువేదిక లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ (ప్రకృతి వ్యవసాయం)పై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అభినాష్‌వర్మ మాట్లాడుతూ కంపోస్టింగ్, పంట మార్పిడి, సహజ పురుగు నియంత్రణ పద్ధతులను పాటించాలన్నారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేస్తూ ఆర్థికంగా ప్రయోజనం పొందాలని హద్నూర్ సర్పంచ్ ఎంఆర్ ప్రవీణ్‌కుమార్ రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ సాయిలు, రైతులు పాల్గొన్నారు.

## డ్వాక్రా, అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు భూమిపూజ



అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శ్రీకారం చుడుతున్న కాంగ్రెస్ నేతలు

**చౌటకూరు, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పోసాని పల్లి, ఉప్పరిగూడెం గ్రామాల్లో భవనాల నిర్మాణాలకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నత్తి దశరథ్, ఎంపిపి మాజీ అధ్యక్షులు భూంరెడ్డి సుభాష్ రెడ్డి సోమవారం భూమి పూజ నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టారు. పోసానిపల్లిలో 10 లక్షల ఉపాధి హామి పథకం నిధులతో మహిళా సమైఖ్య భవనం, ఉప్పరిగూడెంలో 12 లక్షల రూపాయలతో అంగన్‌వాడి భవన నిర్మాణాలకు అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి దామోదర్ రాజనర్సింహా సహకారంతో మండలం శరవేగంగా అభివృద్ధి పనులతో దూసుకుపోతోందన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ శంకర్,, సర్పంచ్‌లు పల్లె రేణుక బాలరాజ్, గొల్ల మల్లేశం, బోడపల్లి గణేష్ ముదిరాజ్, ఉప సర్పంచ్ రమేష్, పంచాయితీ కార్యదర్శి సుకన్య, నాయకులు కలాలి ఈశ్వర్‌గౌడ్, గొల్ల శివకుమార్, మహేందర్‌రెడ్డి, శివకుమార్, కొల్కూరి మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు నీడనిస్తున్న ఇందిరమ్మ ఇళ్లు: సుభాష్‌రెడ్డి

**చౌటకూరు, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇళుల పేదలకు నీడ నిస్తున్నాయని మాజీ ఎంపిపి అధ్యక్షులు భూంరెడ్డి సుభాష్‌రెడ్డి అన్నారు. చౌటకూరులో కొన్యాల ఏసుమణి ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకోగా సోమవారం అధికారులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి గృహ ప్రవేశం చేశారు. ఈ సందర్భంగా సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ సొంత స్థలం ఉన్నవారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయిస్తామన్నారు. మండలంలో 168 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా 122 మంది ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకున్నట్లు ఎంపిడిఓ శంకర్ పేర్కొన్నారు. చౌటకూరులో 29 ఇళ్లు మంజూరు కాగా కొన్యాల ఏసుమణి ముందస్తుగా ఇంటి నిర్మాణం పూర్తి చేసుకుని గృహ ప్రవేశం చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపిఓ సువర్ణ, సర్పంచ్ పార్కల రాంరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సందీప్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు కలాలి రామాగౌడ్, గ్రామ కమిటి అధ్యక్షులు వర్కల రమేష్, నాయకులు కొల్కూరి మొగులయ్య, గోరేమియా, కారోబార్ కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి



ధాన్యాన్ని చూపుతున్న రైతులు

**గుమ్మడిదల ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :** మండలంలో మొక్కజొన్న పంటను పండించిన రైతులు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నారు. సొసైటీ ద్వారా పంటను విక్రయించి రెండు నెలలు గడిచినా ఇప్పటివరకు ఒక్క రూపాయి ఖాతాల్లో జమ కాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి(జిఎంఆర్)కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గుమ్మడిదల సొసైటీ మాజీ చైర్మన్ నంద్యాల విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు అమ్మగారి సదానందరెడ్డి మాట్లాడుతూ రైతులు పంటను అమ్మినా చెల్లింపులు లేకపోవడంతో కుటుంబాలను పోషించలేని దయనీయస్థితికి చేరుకున్నారని అన్నారు. ప్రత్యేకంగా కౌలు రైతుల పరిస్థితి అత్యంత కష్టతరంగా మారిందని చెప్పారు. అప్పులు తీర్చలేక, వడ్డీల భారం మోయలేక తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. పంట విక్రయించి నెలలు గడుస్తున్నా డబ్బులు రాకపోవడం వల్ల విత్తనాలు, ఎరువులు, కూలీలకు చెల్లింపులు చేయలేక రైతులు అల్లాడిపోతున్నారని వాపోయారు.వెంటనే ప్రభుత్వం స్పందించి చెల్లింపులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సంబంధితఅధికారులతో మాట్లాడి రైతులకు చెల్లింపులు త్వరగా అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. రైతుల కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సత్వర పరిష్కారం సాధిస్తానని భరోసా ఇచ్చారు.

## రజక కుటుంబంపై దాడిచేసినవారిని కఠినంగా శిక్షించాలి

**జిన్నారం, ఫిబ్రవరి23, ప్రభాతవార్త :** నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో ఆలయ ప్రవేశ వివాదంలో రజక (చాకలి) కులానికి చెందిన గణేష్ చంద్రకళ మౌనికలపై జరిగిన దాడిలో రెండు నెలల పసిబిడ్డ మృతి చెందిందని, ఈ ఘటనకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని సంగారెడ్డి జిల్లా రజక సంఘం ప్రధాన కార్యదర్శి గణేష్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఘటన ఒక వ్యక్తిగత గొడవ కాదు, ఇది సమాజంలో ఇంకా బ్రతికే ఉన్న అగ్రకుల అహంకారానికి నిదర్శనం అని అన్నారు. దాడి చేసిన వారిపై ఉన్నత అధికారులు విచారణ చేపట్టి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని మళ్లీ ఇలాంటి దుర్ఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు..

# బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ పాలకవర్గం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

**గుమ్మడిదల ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :**
గుమ్మడిదల మున్సిపాలిటీలో సోమవారం నూతన పాలకవర్గం అధికారికంగా బాధ్యతలు స్వీకరించింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై, పాలన ఎలా సాగాలి, ప్రజల పట్ల ప్రతినిధుల బాధ్యత గురించి వివరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ చిన్న పాపనికుమార్‌గౌడ్ మాట్లాడుతూ – ప్రజలే మా బలం, ప్రజలే మా ధైర్యం, ప్రజలే మా లక్ష్యం అని పేర్కొన్నారు. గుమ్మడిదల పట్టణాన్ని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే సంకల్పమని వెల్లడించారు. ప్రతి శాఖ అధికారి ప్రజలకు నేరుగా అందుబాటులో ఉండి, 24 గంటలు ఫోన్ ద్వారా అయినా స్పందిస్తూ, సమస్య పరిష్కారం దిశగా అడుగులు వేయాలని ఆదేశించారు. ప్రజల కష్టాలే తమ కష్టాలు, ప్రజల బాధలే తమ బాధలు అన్న భావనతో ప్రతి ఒక్కరూ పనిచేయాలని కౌన్సిలర్లకు సూచించారు. అలాగే, ప్రతి కౌన్సిలర్‌కు వార్డుల్లోని అత్యవసర సమస్యలను పరిష్కరించేందుకు రూ.5 లక్షల అత్యవసర నిధిని మంజూరుచేయాలని తీర్మానం చేయడం ప్రజల హృదయాలను తాకింది. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ చిమ్ముల సంధ్య, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలియ జేశారు.



కౌన్సిలర్లకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

## ప్రజల నమ్మకాన్ని నిజం చేసేలా పనిచేయండి

### ఎమ్మెల్యే మాణిక్‌రావు

**జహీరాబాద్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** ప్రజల నమ్మకాన్ని నిజం చేసేలా పనిచేయాలని జహీరాబాద్ మున్సిపల్‌కు నూతనంగా ఎన్నికైన బిఆర్ఎస్ కౌన్సిలర్‌లకు ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు సూచించారు. బిఆర్ఎస్ కౌన్సిలర్లతో సోమవారం క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పదవి అనేది బాధ్యత మాత్రమే కాదని, ప్రజలు తమపై ఉంచుకున్న నమ్మకం అన్నారు. ప్రజలు తమపై ఉంచుకున్న నమ్మకం వమ్ము కాకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

**బడంపేట జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే...**

**జహీరాబాద్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** కోహీర్ మండలం బడంపేట గ్రామంలో భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి,రాచన్నస్వామి దేవాలయాల జాతర ఉత్సవాల్లో సోమవారం ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పాల్గొని ఆయా ఆలయాల్లో ఆలయాల అర్చకులు వేదమంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాణిక్‌రావును ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ రామకృష్ణ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు నర్సింలు, నాయకులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : ఎస్ఐ

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :** రహదారిలో ప్రయాణించే సమయంలో ప్రతి ఒక్కరూ ట్రాఫిక్‌నిబంధనలను పాటిస్తూ వెళ్లాలని అదేవిధంగా సేఫ్టీ కోసం హెల్మెట్, ఇన్సూరెన్స్‌ను చేయించుకోవాలని ఎస్ఐ శ్రీశైలం అన్నారు. సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ మైనర్ విద్యార్థులు ఎప్పుడు బైకులను నడపద్దని, అలా నడిపినవారిపై చట్టరీత్యా చర్య తీసుకుంటాయని, వారి తల్లిదండ్రులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని అన్నారు. రవాణా సమయంలో ఏదైనా ప్రమాదం సంభవిస్తే బాధితులను ఆసుపత్రి చేర్చాల్సిన బాధ్యత మనపై ఉంటుందన్నారు. కార్యక్రమంలో పోలీసులు మొగులయ్య, తులసి రామ్, ఉపాధ్యాయులు యాదగిరి, రాజశేఖర్, చంద్రశేఖర్, ధన్సింగ్ పాల్గొన్నారు.

## వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు

**అల్లాదుర్గం, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** మండల పరిధిలోని 16 గ్రామ పంచాయతీలకు ఎన్నికైన వార్డుసభ్యులకు సోమవారం కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో 2 రోజుల పాటు రెండు బ్యాచ్‌లుగా చేసి శిక్షణ తరగతులను ప్రారంభించినట్లు ఎంపిడిఓ వేదప్రకాశ్‌రెడ్డి తెలిపారు. మొదటి బ్యాచ్‌కు ఈనెల 23 నుంచి మండల పరిధిలోని అల్లాదుర్గం, అప్పాజీపల్లి, గడి పెద్దాపూర్, కాగితంపల్లి, రాంపూర్, రెడ్డిపల్లి, సీతానగర్, వెంకట్‌రావు పేట్ పంచాయితీల వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు ప్రారంభించామన్నారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లకు ఈ నెల 23వ తారీఖు నుంచి మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శిక్షణ తరగతులు ప్రారంభవుతాయన్నారు. రెండవ బ్యాచ్‌లో భాగంగా మార్చి 3వ తేదీ నుంచి 7వ తారీఖు వరకు మండలంలోని బహిరన్‌దిబ్బ, సిల్వర్, చేవెళ్ల, గొల్లకుంట తాండ, ముస్లాపూర్, ముప్పారం, మాందాపూర్, నడిమితాండ పంచాయితీల వార్డు సభ్యులకు శిక్షణ ఇస్తామన్నారు.

## మార్చి 6 నుంచి ఈస్టర్‌గుట్ట జాతర ప్రారంభం

**న్యాల్‌కల్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** మండల పరిధిలోని హద్నూర్ గ్రామంలోని గంగ్వార్–అల్లాదుర్గం రోడ్డు పక్కలోని ఈస్టర్ గుట్ట వద్ద మార్చి 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు కొనసాగే జాతర క్రైస్తవ ఉజ్జీవ కూటముల జాతరను పురస్కరించుకుని సోమవారం ఈస్టర్ గుట్ట వద్ద క్రైస్తవ మత పెద్దలు, జాతర నిర్వాహకులు జాతర గోడ పత్రికను ఆవిష్కరించారు. ప్రతి సంవత్సరం నిర్వహించే ఉజ్జీవ కూటముల జాతరకు ఆయా ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని హద్నూర్ క్రైస్తవ సంఘం పెద్దలు సూచించారు. ఉజ్జీవ కూటముల జాతరతో విశ్వాసం, ఐక్యత, ప్రేమ బలపడతాయని హద్నూర్ మెథడిస్ట్ సంఘం కాపరి బి జార్జి అబ్రహం, సంఘం పెద్దలు పేర్కొన్నారు. ఉజ్జీవ కూటముల జారతో ప్రతి ఒక్కరు పాల్గొని దేవుని కృపకు పాత్రులు కావాలని సూచించారు.



జాతర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న క్రైస్తవ సంఘం పెద్దలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

## రైతులు యజమాన్య పద్ధతులు పాటించాలి

**నర్సాపూర్ రూరల్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** రైతులు యజమాన్య పద్ధతులను పాటించాలని ఏఆర్ఎస్ శాస్త్రవేత్త డా. సతీస్ రైతులకు సూచించారు. సోమవారం నర్సాపూర్ రైతు వేదికలో వరిలో సమగ్ర యాజమాన్య పద్ధతులు, సన్న రకాలపై అవగాహన, ఆవంచ రైతు వేదికలో.. సేంద్రీయ వ్యవసాయం,తక్కువ ఖర్చుతో ఎక్కువ రాబడి వచ్చే పద్ధతుల. పై సహచర అభ్యాసం శిక్షణ కార్యక్రమం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆత్మ వారి సౌజన్యంతో రైతులకు శిక్షణ అందించారు. వరి పంటలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు మరియు సన్న రకాల సాగు, సేంద్రీయ వ్యవసాయం ,యూరియా వాడకం తగ్గించడం, మోతాదుకు మించి రసాయన ఎరువుల వాడకం వల్ల కలిగే నష్టాల పై అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారిణి దీపిక మాట్లాడుతూ వ్యవసాయంలో కొత్త సాంకేతిక పద్ధతులను అవలంభించి,సేంద్రీయ వ్యవసాయం చేయడం వల్ల తక్కువ ఖర్చుతో ఎక్కువ రాబడి సాధించి వ్యవసాయం లాభసాటిగా చేయాలని కోరారు. కార్యక్రమంలో నర్సాపూర్ టెక్నికల్ వ్యవసాయ అధికారిణి శ్రీదేవి, ఆవంచ సర్పంచ్ స్రవంతి కరుణాకర్,ఉపసర్పంచ్, వ్యవసాయ విస్తరణ అధికారులు మోహన్,రుతు,దుర్గా ప్రసాద్, తేజస్విని మరియు రైతులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ నిర్వహణ కమిటీ ఏర్పాటు



మాట్లాడుతున్న సర్పంచి ఆవుల గోపాల్‌రెడ్డి

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 23,ప్రభాతవార్త:** మండల పరిధి జంగరాయిలో అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజమ్మ, సర్పంచి ఆవుల గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ స్థాయి పర్యవేక్షణ, సహాయ కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచి మహేష్, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు లిత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## రెడ్డిపల్లిలో విద్యుత్ సమస్య పరిష్కారం

**నర్సాపూర్ రూరల్, ఫిబ్రవరి 22,ప్రభాతవార్త:** నర్సాపూర్ మండలం రెడ్డి పల్లి గ్రామంలోకొన్ని సంవత్సరాలుగా సింగిల్ ఫేస్ బుడ్డి తో తక్కువ వోల్టేజ్ విద్యుత్ సమస్యతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను ఆదివారం సర్పంచి పద్మావతిగౌడ్ పరిష్కరించారు. గ్రామంలో తక్కువ వోల్టేజ్ తో సింగిల్ ఫేస్ విద్యుత్ సరఫరా చేయడం వల్ల ఇట్లో ఎల్క్‌ట్రిక్ వస్తువులు మరమ్మత్తు చేస్తున్నప్పుడు ప్రమాదాల ఘటనలను దృష్టిలో ఉంచుకొని నూతన సింగిల్ ఫేస్ బుడ్డి ఏర్పాటు చేశారు. విద్యుత్ సమస్య పరిష్కరించినందుకు గ్రామ ప్రజలు సర్పంచి పద్మావతిగౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లైన్మెన్ రఘుపతి, సెక్రెటరీ రమేష్, అశోక్‌గౌడ్, వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బందినాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్‌లకు సన్మానం

**జహీరాబాద్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** జహీరాబాద్ మున్సిపల్‌కు నూతనంగా ఎన్నికైన చైర్మన్ మహమ్మద్ యూనూస్, వైస్ చైర్మన్ కొత్తకాపు శిరీష సురేందర్‌రెడ్డి, కౌన్సిలర్ రంగా అరుణ్‌కుమార్, జి.కవిత అశోక్‌కుమార్ లను అంబేద్కర్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో సభ్యులు ఆదివారం రాత్రి పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కండెం నర్సింలు, స్టడీ సర్కిల్ నాయకులు, లెక్చరర్ ఎం అశోక్, ఉపాధ్యాయులు నరసయ్య, రామచంద్ర, మొగులయ్య గౌతమ్, డి శ్రీనివాస్, పుష్పమ్మ, సువర్ణ, దిక్కీ జిల్లా కన్వీనర్ ఎజనార్థన్, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, మహిళలు పాల్గొన్నారు.



మున్సిపల్ చైర్మన్‌ను సన్మానిస్తున్న అంబేద్కర్ స్టడీ సర్కిల్ బాధ్యులు

# నేటి నుంచి త్రిశక్తి దేవాలయం వార్షికోత్సవాలు

**గజ్వేల్, ఫిబ్రవరి 23 (ప్రభాతవార్త):**
గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధి ప్రజ్ఞాపూర్ లోని శ్రీమహంకాళి,శ్రీపెద్దమ్మతల్లి, శ్రీనల్ల పోచమ్మ త్రిశక్తి దేవాలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కాటు జయరాములు, ఆలయ అధ్యక్షుడు కదుళ్ల ఎల్లేశం తెలిపారు. ఈనెల 24వ తేదీ నుంచి 26వ తేదీ వరకు మూడు రోజులపాటు వేడుకలను ఘనంగా నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. 24వ తేదీ మంగళవారం ఉదయం 8 గంటల నుండి గణపతి పూజ, పుణ్యాహవాచనం, అఖండ దీపారాధన, రక్షాబంధనం, మండప స్థాపన, కలశ స్థాపన, అమ్మవారి మూల విగ్రహాలకు విశేష పంచామృత అభిషేకం, అగ్నిప్రతిష్ఠ, స్థాపిత దేవత హవనం, శివపార్వతుల కళ్యాణం, గణపతి సహిత స్థాపిత దేవతమూర్తుల పూజ, శ్రీ సూక్త, దుర్గా సూక్త సహిత అమ్మవారి మూలమంత్ర హవనం, గోపూజ, బలి ప్రదానం, పూర్ణాహుతి, కలశోద్వాసన, ఆశీర్వచనం జరుగుతాయని తెలిపారు. 25వ తేదీ బుధవారం శ్రీ పోచమ్మ అమ్మవారికి బోనాల సమర్పణ, 26వ తేదీ గురువారం శ్రీ మహంకాళి అమ్మవారికి, శ్రీపెద్దమ్మతల్లి, శ్రీనల్లపోచమ్మ అమ్మవార్లకు బోనాల సమర్పణ జరుగుతుందని తెలిపారు. ఉత్సవాలు జరిగే మూడు రోజులు భక్తులకు అన్న ప్రసాద వితరణ ఉంటుందని, ఈమహా కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షులు ఎల్ల వెంకటేశం, బెదరమైన కుమార్, కోశాధికారి గుర్రాల నరేష్, కార్యవర్గ సభ్యులు కదుళ్ల రమేష్, కాటు కుమార్, బోస్ల కృష్ణ, బెదరమైన మల్లేశం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆలయ కమిటీ నిర్వాహకులు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

## మల్లన్న ఆశీస్సులతో ప్రజలు సంతోషంగా ఉండాలి : ఎమ్మెల్సీ అంజిరెడ్డి

**జిన్నారం, ఫిబ్రవరి 23,ప్రభాతవార్త:** గడ్డపోతారం మున్సిపల్ ఖాజీపల్లి లో సోమవారం నిర్వహించిన మల్లికార్జునస్వామివారి 18వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి కళ్యాణ మహోత్సవం, జాతర కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిన్నారం మాజీ జడ్పీటీసీ కొలన్ బాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్టు తెలిపారు.గ్రామీణ ప్రాంతాలలో నిర్వహించే జాతరలు తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకలని అన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు ఆకుల మమతనవీన్, గండి స్వప్నకుమార్‌యాదవ్, అర్కాల్ సంధ్యసురేష్, నాయకులు మురళి యాదవ్, సమీర్, గణేష్, వరుణ్, బాలు, మహేష్, అశోక్, మాజీ వార్డు మెంబెర్ కురుమ కృష్ణయాదవ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మల్లన్న జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్

**పటాన్‌చెరు, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త :** ముత్తంగి డివిజన్ పరిధిలోని పాటి గ్రామంలో సోమవారం నిర్వహించిన భ్రమరాంబ మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం, జాతర కార్యక్రమాల్లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్టు తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే జీఎంఆర్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇస్నాపూర్ మున్సిపల్ చైర్మన్ మోటె సుమలత, గ్రామ మాజీ సర్పంచ్ లక్ష్మణ్, మాజీ కార్పొరేటర్ పుష్ప నగేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ వైస్ ఎంపీపీ స్వప్న శ్రీనివాస్, మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం

### న్యాయం చేయాలని ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన రైతులు

**సదాశివపేట, ఫిబ్రవరి 23 (ప్రభాతవార్త):** తీయని మాటలతో రైతుల గురించి మైకులు పట్టుకొని గొప్పగా చెప్పడమే కానీ, మేలుకోరే పనులను చేయడంలో ప్రభుత్వం విఫలమవుతుంది. ఈ సంవత్సరం పత్తి పంట దిగుబడి లేక పోవడంతో అప్పుల పాలై కోలుకోలేని స్థితిలో దెబ్బతిన్న రైతు పరిస్థితి వారి కుటుంబం కార్చే కన్నీరును చూచి ఏ ప్రజా నాయకుడికైనా మనసు కరుగుతుందా... పండించిన పంటకు మద్దతు ధర ప్రకటిస్తున్నారు కానీ కొనుగోలు కేంద్రాలు వారి పంటను కొనడంలో కొర్రీలు పెడుతూ తిప్పి పంపుతున్నారు. ఈ విషయమై బొబ్బిలిగ్రామానికిచెందిన రైతు రజినీకాంత్ సంగారెడ్డి కలెక్టరేట్లోని ప్రజావాణిలో సోమవారం ఫిర్యాదు చేశారు. కొనుగోలు కేంద్రాలలో కందులు కొనకపోవడంతో అవసరాలకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తుందని, ఈ విషయమై రైతులు సదాశివపేటలోని రైతు సేవాకేంద్రంలో సంప్రదించగా పైఅధికారుల నుంచి ఎలాంటి లిఖితపూర్వక ఆదేశాలు రాతూవని, పంట నాణ్యతగా లేదని హమాలీలు లేరని అదీకాక ఒక రైతు ఒక లోడు ఒకేసారి తీయాలని ఎన్నెన్నో కొర్రీలు పెడుతున్నారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ కల్పించుకొని మార్క్‌ఫెడ్ ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేసి మాకు ఆత్మస్థైర్యాన్ని నింపాలని వారు అన్నారు.

## నాగుల్‌దేవులపల్లిలో సిసి కెమెరాల ఏర్పాటు

**హత్నూర, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:** మండల పరిధిలోని నాగుల్‌దేవుల పల్లిలో సిసి కెమెరాలు ఏర్పాటుకు హత్నూర పోలీసులు శ్రీకారం చుట్టారు. గ్రామంలో శనివారం తెల్లవారుజామున అంబేద్కర్ జండా కట్టెను గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్‌పోసి తగలబెట్టిన విషయం తెలిసిందే. అనంతరం జిన్నారం సిఐ రమణారెడ్డి, ఎస్సై శ్రీధర్‌రెడ్డి గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద హత్నూర ఎస్సై శ్రీధర్‌రెడ్డి చొరవతో మూడు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

## ప్రజా సంక్షేమమే లక్ష్యం : ఎమ్మెల్యే

**పటాన్‌చెరు, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** ప్రజా సంక్షేమం, ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం పటాన్‌చెరు డివిజన్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివిధ గ్రామాలు, పట్టణాలకు చెందిన 54 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ద్వారా మంజూరైన 24 లక్షల 43 వేల రూపాయల విలువైన చెక్కులను ఎమ్మెల్యే జీఎంఆర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ వైద్య చికిత్సల నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందినవారికి ఆర్థిక భరోసా కల్పిస్తూ ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అండగా నిలుస్తుందన్నారు. దీని ద్వారా ప్రతినెల లక్షలాది రూపాయలవిలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్ఓసిలు పారదర్శకంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిన్నారం మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డి. అమీన్‌పూర్ మాజీ ఎంపీపీ దేవానంద్, సీనియర్ నాయకులు సత్యనారాయణ, వెంకటేష్, ఐలేష్, రామచంద్రారెడ్డి, శివరాజ్, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల అభివృద్ధే లక్ష్యం : చిమ్ముల గోవర్ధన్ రెడ్డి

**గుమ్మడిదల, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త :** అనంతారం గ్రామ వాలీబాల్ మైదానంలో సొంత నిధులతో ఏర్పాటు చేసిన ఫ్లడ్ లైట్స్‌ను బిఆర్ఎస్ నాయకులు, సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ యువత క్రీడల ద్వారా ఆరోగ్యవంతంగా ఎదగడమే కాకుండా రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. గ్రామాభివృద్ధికి నిరంతరం సహకరిస్తున్న చిమ్ముల గోవర్ధన్‌రెడ్డికి ప్రజల తరఫున సర్పంచ్ కొమ్ము శ్రీను కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్‌కుమార్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, సిజిఆర్ ట్రస్ట్ వైస్ చైర్మన్ చిమ్ముల నరేందర్ రెడ్డి, పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, ఆకుల సత్యనారాయణ, ఉప సర్పంచ్ యాదిరెడ్డి, గోపాల్, సాయి రెడ్డి, భాస్కర్ గౌడ్, మహేష్ యాదవ్, రమణ, భాస్కర్, యాదగిరి, నర్సింగారావు, క్రీడాకారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## వైభవంగా ఆలయ వార్షికోత్సవం

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :** పట్టణంలోని శ్రీభక్త మార్కండేయ ఆలయ ప్రథమ వార్షికోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులు ఉదయం నుండే భక్తమార్కండేయ చంద్రమోళీశ్వరస్వామికి ప్రత్యేక అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. కాగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి కొడుకు, కోడలు అనురాగ్ రెడ్డి, మోనిక రెడ్డిలు అభిషేక కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల సమక్షంలో మహాహారతి కార్యక్రమాన్ని నిర్వహించి, భక్త మార్కండేయుని చరిత్ర భక్తులకు వివరించారు. అనంతరం బ్రహ్మశ్రీ గురురాజు శర్మ నవగ్రహాల పూజ, హోమం, శివపార్వతుల కళ్యాణం నిర్వహించారు. దత్తాత్రేయ టెంపుల్ నుండి భక్త మార్కండే టెంపుల్ వరకు నిర్వహించిన ఉత్సవ విగ్రహాల శోభాయాత్ర, జడ కొప్పు ప్రదర్శన, మహిళల కోలాటం అలరించాయి. ఈ కార్యక్రమంలో కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రామ్ మహారాజ్, అంతర్గాం పీఠాధిపతి కరణ్ గజేంద్ర భారతి మహారాజ్, శ్రీపంతులు, మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి, గుర్రపు మచ్చేందర్, అభిషేక్ షెట్కార్, వివేకానంద, విజయ్ బుజ్జి, వివిధ గ్రామాల సర్పంచులు గోస్కె సురేష్, జంగం శ్రీనివాస్, భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు, బాధ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేశారు.



పూజలలో పాల్గొన్న భక్తులు